
ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



వార్త

శనివారం 30, ఆగష్టు 2025 | 16 పేజీలు


# ఆల్వేస్ పోలీస్ అలర్ట్..!



శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసులు ఎంత ప్రాధాన్యత ఇస్తారో.. అసమాన్య ఘటనలు చోటు చేసుకున్నప్పుడు.. వరదలు ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు ప్రజలకు రక్షణగా నిలుస్తున్నారు ఖమ్మం కమిషనరేట్ పోలీసు లు. ఆల్వేస్ పోలీస్ అలర్ట్ అంటూ.. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ.. తనదైన శైలిలో ముందుకు దూసుకు వెళుతున్నారు ఖమ్మం పోలీస్ కమిషనర్, సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ దత్. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గ్యాలంటరీ అవార్డు పొందిన పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసిన శ్యామ్ నల్లి ఖమ్మం క్రైమ్ ప్రభాతవార్తతో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రత్యేకంగా మాట్లాడారు..

## కమిషనరేట్‌లో ఖాకీల నిరంతర తనిఖీలు



- సిటీ పోలీస్ యాక్ట్ అమలుతో నేరాల నియంత్రణ
- వరదలు ప్రకృతి విపత్తులలో ప్రజలకు రక్షకభటుల విశేష సేవలు
- గణేష్ మండపాల పర్యవేక్షణ, అప్రమత్తంగా వ్యవహరించేలా సూచనలు
- ప్రశాంత నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త

2లో..



# మోగిన ప్రమాద ఘంటికలు

- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- నేడు నిలకడగా ప్రవాహం
- వినాయకుని నిమజ్జనం వరకు దోబూచులాడనున్నట్లు అధికారుల అంచనా
- పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశం



2లో..

భద్రాచలం, ప్రభాతవార్త :

భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం వేగంగా పెరిగింది. గురువారం సాయంత్రం 6 గంటలకు 38.60 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం శుక్రవారం ఉదయం 8 గంటలకు 35.50 అడుగులకు చేరుకుని తగ్గుముఖం పట్టింది. దీంతో మరింత తగ్గుముఖం పడుతుందని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకు న్నారు. కానీ ఉదయం 9 గంటల నుంచి గోదావరి



12వ పేజీలో...

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

# శివోహం..శివోహం.. రామలింగని ఆస్తులకు అశ్వతర్పణం

- కోట్ల విలువైన భూముల అన్యాక్రాంతం
- రెవెన్యూ పహణీల్లో గోల్‌మాల్
- భూభారతి చూపించే యజమానులెక్కడివారు
- సుప్రీం తీర్పుకి ఇది విరుద్ధం
- సైట్ హ్యాకింగ్‌కి గురయిందా
- తక్షణ విచారణకు భక్తుల డిమాండ్

చింతకాని/ప్రభాతవార్త

వందన గ్రామ రామ లింగేశ్వరాలయ భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డులంతా గందరగోళంగా మారాయి. సమాచార హక్కు ద్వారా మాకు



12వ పేజీలో...

# ఆల్వేస్ పోలీస్ అలర్ట్..!

**కమిషనరేట్‌లో ఖాకీల నిరంతర తనిఖీలు**
**సిటీ పోలీస్ యాక్ట్ అమలుతో నేరాల నియంత్రణ**
**వరదలు ప్రకృతి విపత్తుల్లో ప్రజలకు రక్షక భటుల విశేష సేవలు**
**గణేష్ మండపాల పర్యవేక్షణ, అప్రమత్తంగా వ్యవహరించేలా సూచనలు.. ప్రశాంత నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు**
**ఖమ్మం క్రైమ్ ప్రభాతవార్త శ్యామ్ నల్లితో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ముఖాముఖి**

శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసులు ఎంత ప్రాధాన్యత ఇస్తారో.. అసమాన్య ఘటనలు చోటు చేసుకున్నప్పుడు.. వరదలు ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు ప్రజలకు రక్షణగా నిలుస్తున్నారు ఖమ్మం కమిషనరేట్ పోలీసులు. ఆల్వేస్ పోలీస్ అలర్ట్ అంటూ.. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ.. తనదైన శైలిలో ముందుకు దూసుకు వెళుతున్నారు ఖమ్మం పోలీస్ కమిషనర్, సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ దత్.



ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గ్యాలంటరీ అవార్డు పొందిన పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసిన ఖమ్మం క్రైమ్ ప్రభాతవార్తతో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రత్యేకంగా మాట్లాడారు..

**శ్యామ్ నల్లి, ఖమ్మం క్రైమ్, ప్రభాత వార్త**

గతంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఎంతో ధైర్యసాహసాలతో సమర్ధవంతంగా విధులు నిర్వర్తించడంతో కేంద్ర ప్రభుత్వం గ్యాలంటరీ మెడల్ 2024 కు ఎంపిక చేసింది. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ గోల్కొండ కోట లో ఏర్పాటు చేసిన వేడుకలలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా గ్యాలంటరీ మెడల్ ను అందుకున్నారు పోలీస్ కమిషనర్ సునీల్ దత్.

### నిఘా నీడలో నిరంతర పర్యవేక్షణ

ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో శాంతిభద్రతల పర్యవేక్షణకు పెద్ద పీట వేయడమే కాకుండా.. నేరాల నియంత్రణ.. అక్రమాల అడ్డుకట్టకు నిరంతర తనిఖీలు జరుపుతున్నామన్నారు. ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ.. పలు సూచనలు సలహాలు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలోకి వచ్చి వెళ్లే అన్ని వాహనాలను నిరంతరంగా ఆయా పోలీస్ స్టేషన్లో పరిధిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడమేకుండా.. అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని చెప్పారు. చోరీల నియంత్రణకు, నేరాల అడ్డుకట్టకు ప్రణాళికాబద్దంగా ముందుకు వెళుతున్నామని ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా పోలీసులు తమ విధులు నిర్వహిస్తుంటారని పేర్కొన్నారు.

### మాదక ద్రవ్యాల నియంత్రణకు అడ్డుకట్ట

మాదక ద్రవ్యాల నియంత్రణకు అడ్డుకట్ట వేసే దిశగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా మీదుగా గంజాయి అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఆకస్మిక తనిఖీలు చేపడుతూ మంచి ఫలితాలను రాబట్టామన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా భారీగా గంజాయి రవాణా చేసే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువత గంజాయి మత్తుకు బానిసలు అవుతుండటంతో వారి తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తూ పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే పోలీసులు దృష్టికి తీసుకురావాలని తద్వారా ఉన్నతాధికారుల ఆదేశాలతో కౌన్సిలింగ్ ప్రక్రియను కూడా నిర్వహిస్తామని చెప్పారు.

### సిటీ పోలీస్ యాక్ట్ అమలుకు ప్రాధాన్యం

గతంలో అర్ధరాత్రి దాటినా తెరిచి ఉండే షాపులు.. అర్ధరాత్రులు ద్విచక్ర వాహనాలపై ఇద్దరు ముగ్గురు పని ఉన్నా.. లేకపోయినా రోడ్లపై తిరుగుతుండటం.. తెల్లవార్లు దాబాలు, బెల్టు షాపుల్లో అక్రమ మద్యం అమ్మకాలు సాగడం, బహిరంగ మద్యం సేవిస్తూ ఇతరులకు ఇబ్బందులు కలుగజేయడం, ర్యాష్ డ్రైవింగ్, న్యూసెన్స్ సాగిస్తూ పలు ఆకతాయిలు, అల్లరిమూకలు అర్ధరాత్రులు దాటినా రోడ్లపై బర్త్ డేల పేర్లతో వాహనాలు నిలిపి గలాటాలు సృష్టించడంపై ఉక్కుపాదం మోపారు. సీపీ సునీల్ దత్. పోలీస్ కమిషనరేట్లో సిటీ పోలీస్ యాక్టుకు ప్రాధాన్యత కల్పించడంతో రాత్రి 10.30 గంటల కల్లా షాపులు మూసివేయడంతో రోడ్లపై అనవసర జన సంచారం చాలా వరకు తగ్గింది. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, ర్యాష్ డ్రైవింగ్, న్యూసెన్సులు సృష్టించే ఆకతాయిలపై ఉక్కుపాదం మోపుతు న్నామన్నారు.

సిటీ పోలీస్ యాక్టు అమలు చేయడంలో ప్రాధాన్యతను సిబ్బందికి వివరిస్తూ నమోదైన పలు కేసుల్లో సెక్షన్ల ప్రాధాన్యతను కూడా అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పిస్తూ దగ్గరుండి మరీ కేసులను పర్యవేక్షి స్తున్నామన్నారు.

### అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదనే సంకేతం

జిల్లా పోలీస్ శాఖలో గత కొంత కాలంగా పేరుకుపోయిన నిర్లక్ష్యపు జాడ్యానికి చెక్ పెట్టేలా వ్యవహరిస్తున్నారు పోలీస్ కమిషనర్ సునీల్ దత్. కమిషనరేట్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించినా, అక్రమాలకు పాల్పడినా వేటు తప్పదనే సంకేతాలు ఇస్తున్నారు. ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బంది. అధికారుల పనితీరును నిశితంగా పరిశీల్చిచి నివేదికల ఆధారంగా చర్యలు చేపట్టారు. విజిబుల్ పోలీ సింగ్ కు పెద్ద పీట వేస్తూ నిరంతరం తనిఖీలతో సిబ్బందిని అప్రమత్తం చేస్తూ.. ఖమ్మం పోలీస్ కమిషనరేట్లో సునీల్ దత్ మార్క్ కనబరుస్తున్నారు.

### భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జలమయం అయిన రోడ్లు, వంతెనలు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దు. జిల్లాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రజలకు తెలియజేశారు. జిల్లాలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నీట మునిగిన రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని అన్నారు. ఎవరు కూడా చేపల వేటకు వెళ్లవద్దని, పశువుల కాపర్లు చెరువులు, వాగులు దాటవద్దని, యువకులు సెల్ఫీల కోసం నీటి ప్రవాహం వద్దకు వెళ్లవద్దని సూచించారు. పిల్లలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇప్పటికే చెరువులు, వాగుల వద్ద పోలీస్ పెట్రోలింగ్ పెంచి ప్రమాద హెచ్చరికలను తెలియజేసేలా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చెరువులు, కుంటల వద్ద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని వంతెనలు, చప్టలపై బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాల భారీన పడకుండా వాహనాల రాకపోకలను నిషేధించాలని పోలీస్ అధికారులకు ఆదేశించమని తెలిపారు. అదేవిదంగా ఎగువ ప్రాంతంలో అధిక వర్షాల మూలంగా మున్నేరు వరద ఉధృతి పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు...

### గణేష్ మండపాల నిరంతర పోలీస్ పహారా

వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని శాంతి సామరస్యాన్ని కాపాడుకుంటూ భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోలా నవరాత్రుల ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో జరుపుకొనే అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను గతంలో లాగానే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా జరుపు కొనేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా మండపాల్లో డీజే ఏర్పాటుకు అనుమతి లేదని, నిబంధనలను మండపం నిర్వాహకులు, కమిటీలు పాటించాలని సూచించారు. గణేష్ మండపంలో 24 గంటల పాటు విధిగా వాలంటీర్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని అంతే కాకుండా భక్తుల సందర్శనను దృష్టిలో ఉంచుకుని మండపాలలో క్యూలైన్లను ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించామన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు, కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయించామని. గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

వినాయక నిమజ్జనోత్సవానికి జిల్లా పరిధిలో ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. గణేష్ నిమజ్జనం కోసం భారీ పోలీసు బందోబస్తుతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు గజ ఈతగాళ్లను, నిమజ్జనానికి వినియోగించే క్రేన్స్, లైటింగ్స్, సీసీ టీవీ కెమెరాలు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా చెరువులు, ఇతర నిమజ్జన నీటి కుంటల వద్ద వీధి దీపాలు, ఫ్లడ్ లైట్లు, అవసరమున్న మేర క్రేన్లను ఏర్పాటు చేయనున్నట్లు పెర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం గణేశ్ నిమజ్జనం జరిగే చెరువు కట్టల వద్ద విద్యుత్ లైట్లను, బారికేడ్లు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ కమిషనరేట్‌లో ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లి విజయవంతం చేస్తామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు.





# మోగిన ప్రమాద ఘంటికలు

**మొదటిపేజీ తరువాయి**

ప్రవాహం వేగంగా పెరిగింది. పెను తుఫాన్ల కారణంగా గోదావరి ఉపనదులు అయిన ప్రాణహిత, ఇంద్రావతి పొంగి పొర్లడం, ఇంద్రావతి నది నుంచి మేడిగడ్డ ప్రాజెక్టు ద్వారా గోదావరికి వరద నీరు పోటెత్తడం, ఎగువన ఉన్న ప్రాజెక్టులు అన్ని నిండడంతో గోదావరి నది దిగువ ప్రాంతానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. పేరూరు వద్ద గోదావరి నది ఉదయం 11 గంటల సమయంలో 16.550 మీటర్ల ఎత్తులో ప్రవహించగా రాత్రి 7 గంటల సమయంలో 16.660 మీటర్ల ఎత్తులో ప్రవహించింది. అదేవిధంగా కాళేశ్వరం వద్ద రాత్రి 8 గంటల సమయంలో 12.350 మీటర్ల ఎత్తులో గోదావరి నది ప్రవహించగా భద్రాచలం వద్ద మధ్యాహ్నం 12 గంటల సమయానికి 37.50 అడుగులకు చేరుకున్న గోదావరి మధ్యాహ్నం 03 గంటల సమయానికి 39.90 అడుగులకు చేరింది. సాయంత్రం 6 గంటల సమయానికి 42.20 అడుగులకు చేరగా, 7.22 గంటల సమయానికి 43 అడుగులకు చేరుకుంది. దీంతో జిల్లా కలెక్టర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. 10 గంటల సమయానికి 44.30 అడుగులకు చేరుకుని 9,88,792 క్యూసెక్కుల వరద నీరు భద్రాచలం మీదుగా దిగువకు పయనమవుతుంది. కాగా మరో రెండు అడుగులు గోదావరి నీటిమట్టం ఎరిగి నిలకడగా ఉండనుందని సంబంధిత అధికారులు అంచనా వచ్చారు. మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసిన వెంటనే జిల్లా కలెక్టర్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వరద పరిస్థితులను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తున్నదని, ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే అవసరమైన చర్యలు తీసుకొబడతాయని పేర్కొన్నారు. ప్రజలు రక్షణ చర్యల్లో సహకరించాలని, అధికారుల సూచనలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ కోరారు. అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ నెంబర్లు సంప్రదించాలని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అప్రమత్తమైన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతాల జాబితాను సిద్ధం చేయగా ఆ గ్రామాలను తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు విస్తృతంగా పర్యటించి ఆ గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి ఎప్పుడు వరదలు ముంచుకొచ్చినా అప్రమత్తంగా ఉండాలని, వెంటనే పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచిస్తున్నారు. భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతుండడంతో కరకట్టకు ఉన్న స్లూయిస్‌లకు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇసుక బస్తాలు వేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సైతం గజ ఈతగాళ్లకు, రిస్క్యూ టీంలకు ప్రజలను ఎలా కాపాడాలనే అంశంపై మాక్ డ్రిల్ ద్వారా ఇప్పటికే అవగాహన సదస్సు నిర్వహించారు. గోదావరి నది వద్ద భక్తులు లోతుకు వెళ్ళకుండా మైక్ల ద్వారా హెచ్చరిస్తూ పోలీసులు, గజ ఈతగాళ్లు ఎప్పటికప్పుడు గస్తీ కాస్తున్నారు. సబ్ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే గోదావరి పరివాహకమైన పలు చోట్లకు ఎవ్వరూ వెళ్లకుండా పట్టణ సీఐ నాగరాజు పటిష్ట నిషేధ ఆజ్ఞలు విధించారు.

## 25 లక్షల రూపాయల గంజాయిని పట్టుకున్న పోలీసులు

**మూడు కార్లు,ద్విచక్ర వాహనం స్వాధీనం సి ఐ వెంకటేశ్వరరావు**

**పినపాక, ప్రభాతవార్త**



మండల పరిధిలోని పెంట్లగూడెం గ్రామ శివారులో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇ బయ్యారం పోలీస్ స్టేషన్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ వి వెంకటేశ్వరావు విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి ఘటనకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. ఒడిశా నుంచి హైదరాబాద్ కు తరలిస్తున్న 50 కేజీల గంజాయి తరలిస్తున్న ఐదుగురుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విశ్వాసనియా సమాచారం మేరకు గురువారం వాహన తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీలలో మూడు కార్లలో తరలిస్తున్న 50కేజీల గంజాయి,నలుగురు నిందితులు పట్టుబడ్డారన్నారు. గంజాయి తరలిస్తున్న వాహనం ముందు పైలెట్ గా ద్విచక్రవాహనంపై వెళుతున్న మరొకరిని అదుపులోకి తీసుకోన్నట్లు తెలిపారు. వాహనలతో పాటు ఐదుగురుపై కేసు నమోదు చేయడం జరిగింది అన్నారు. పట్టుబడిన గంజాయి విలువ స్థానికంగా రూ 25 లక్షల వరకూ ఉంటుందన్నారు. నిందితులు పల్లెపు శ్రీకాంత్ (కరీంనగర్), దాసరి వెంకటేశ్వరరావు (చంద్రుగొండ), మడకం రాజు (కుంట చతిస్గడ్), కొండూరి వినయ్ (చింతకాని), తంబళ్ల పుల్లారావు (చంద్రుగొండ) అని తెలిపారు. ఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# యువజన,ప్రజా సమస్యలపై డీవైఎఫ్ఐ పోరాటాలు

### దేశంలో మోడీ డైవర్షన్ రాజకీయాలు

### కారేపల్లి మండల మహాసభలో డీవైఎఫ్ఐ నేత చింతల రమేష్

*కారేపల్లి ఆగస్టు 29 ప్రభాతవార్త:*

యువజన, ప్రజా సమస్యలపై డీవైఎఫ్ఐ నిరంతరం సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ అన్నారు. శుక్రవారం కారేపల్లి మండల మహాసభ భాగం రామనర్సయ్య భవన్‌లో దారావత్ వినోద్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో చింతల రమేష్ మాట్లాడు తూ దేశంలో మోడీ డైవర్షన్ రాజకీయాలు నడిపిస్తున్నారని, మతం, యుద్ధం వైపు దృష్టి మరలుస్తూ తన అధికారాన్ని కాపాడుకుంటున్నాడని విమర్శించారు.



యువతకు బీజేపీ మోడీ ప్రభుత్వం ఏడాది రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చారని,నేడు ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ పరం చేస్తూ నిర్వీర్యం చేస్తూ ఉన్న ఉద్యోగాలను తీసివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని రాజ్యాంగ సంస్థలను తమగుప్పెట్లో పెట్టుకోని ఆధికారం కోసం బరితెగిస్తున్నారన్నారు. ప్రత్యేక ఓటర్ సవరణ (సర్)పేరుతో ప్రతిపక్షాల అనుకూల ఓట్లను తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ అమలు చేయకుండా కల్లబల్లి కబుర్లు చెప్తూ కాలం వెళ్లదీస్తుందన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు ఇవ్వడంలో విఫలం చెందారన్నారు. ఖమ్మం జిల్లాలో బలమైన పోరాటాల రూపకల్పనకు ఆగస్టు 31న ఖమ్మం మంచికంటి భవన్ లో డీవైయఫ్ఐ జిల్లా మహాసభలు జరుగుతున్నాయన్నారు. నూతన కమిటీ ఎన్నిడీవైఎఫ్ఐ కారేపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష,కార్యదర్శులుగా ధారావత్.వినోద్, ఆదెర్ల వినయ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల ఉపాధ్యక్షులుగా చినుముల భరత్,నరేష్, కిన్నెర కిరణ్, గడ్డం.దీలిఫ్, సహాయ కార్యదర్శులుగా నవీన్, నరేందర్, సంపత్, సాంబ కమిటీ సభ్యులుగా వెంకటేష్, శ్రీధర్, అనిల్, రణధీర్, సలీమ్, రఘు, నాగరాజు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయు మండలకన్వీనర్ కే.నరేంద్ర, అదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన టిఎల్ఎం మేళ

### విద్యార్థులకు సులభంగా నేర్చుకునేందుకు బోధనా పద్ధతులు

### ఉపాధ్యాయుల ప్రతిభకు నిదర్శనం

### డిప్యూటీ డైరెక్టర్ మణమ్మ

*కారేపల్లి ఆగస్టు 29 ప్రభాతవార్త*

విద్యార్థులకు సులభంగా నేర్చుకునేందుకు వీలుగా బోధనా పద్ధతులు ఉపయోగపడతాయని టిఎల్ఎం మేళ ద్వారా ఉపాధ్యాయుల ప్రతిభకు దిక్సూచిగా పనిచేస్తాయని భద్రాచలం డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ అన్నారు. మండల పరిధిలోని చేన్నంగలగడ్డ ఆశ్రమ పాఠశాల యందు ఏర్పాటుచేసిన టిఎల్ఎం మేళ విజయవంతమైంది. ఆశ్రమ పాఠశాల హెచ్ఎం బి నామ నాయక్ సిబ్బంది విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. ఐటీడీఏ పరిధిలోని ఐదు మండలాల కు చెందిన 63 పాఠశాలల నుండి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ మాట్లాడుతూ పలువురు ఉపాధ్యాయులు రూపొందించిన సృజనాత్మక బోధన అభ్యాస సామాగ్రి ఈ మేళా యందు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. విద్యార్థులు వివిధ అంశాలను నేర్చుకునేందుకు వీలుగా రూపొందించిన అభ్యాసనా పద్ధతులు సులభమైన రీతిలో అర్థమయ్యేందుకు ఉపయోగపడతాయన్నారు. ఇలాంటి మేళాల ద్వారా ఉపాధ్యాయుల ప్రతిభను వెలికి తీయడమే కాకుండా నూతన అంశాలు విద్యార్థులకు ప్రయోజన చేకూరుస్తాయన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అధునాతన అంశాలను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ మేళాకు ఏసీఎంవో రమేష్ ఏ టి డి ఓ రాధ వివిధ మండలాలకు చెందిన ఎస్ సి ఆర్ పి లు నలుగురు ప్రధాన ఉపాధ్యాయులు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# సీతారామ ప్రాజెక్ట్ భూ సేకరణ లో పరిహా రం ను గత అవార్డు రద్దు చేసి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రైతులకు ఇవ్వాలి

### భూ నిర్వాసితుల సంఘం నేత దుగ్గి కృష్ణ

*కామేపల్లి, ఆగష్టు 29 ప్రభాతవార్త*

సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ భూ సేకరణ కో సం 2019 లో విడుదల చేసిన పరిహారం అవార్డు రద్దు చేసి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం



ప్రకటించాలని భూ నిర్వాసితుల సంఘం జిల్లా నేత దుగ్గి కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కామేపల్లి గ్రామ పంచా యతీ కార్యాలయం లో జరిగిన భూ సేకర ణ గ్రామ సభ సందర్భంగా భూ నిర్వాసి తులు భూ సేకరణ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, భూ నిర్వాసితుల సంఘం జిల్లా నేత దుగ్గి కృష్ణ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కెనాల్ నిర్మాణం కోసం 516 ఎకరాల భూమిని ప్రభుత్వం భూ సేకరణ చేసి 2019 లో పరిహారం అవార్డు ప్రకటిం చి నేటికీ రైతులకు పరిహారం అందించలే ద అని అన్నారు. 2019 నుంచి నేటివరకు భూములు ప్రభుత్వం రైతుల పేర్లు నుంచి తొలిగించి కనీసం రైతు భరోసా కూడా ఇవ్వలేదు అని గత అవార్డు రద్దు చేసి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలి అని కోరారు. ఈ కార్యక్రమం లో రైతులు అంతోటి అచ్చయ్య, సింగం వెంకన్న, అజ్మీర రాందాసు, కొర్ర రాములు, కంపసాటి సురేష్, ముక్తి సాంబశివరావు, అజ్మీరా అర్జున్, అజ్మీర శివ, హుస్సేన్ రైతులు పాల్గొన్నారు.

# పింజర మడుగులో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను పరిశీలించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

### మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు

*కామేపల్లి, ఆగష్టు 29 ప్రభాతవార్త:*

కామేపల్లి మండలం పింజరమడుగు గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం పరిశీలించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు అవసరమైన మౌలిక సదు పాయాల పనులను అధికారులు వేగవం తంగా నిర్వహించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎంత మాత్రమూ అలసత్వం వహించవ ద్దని హెచ్చరించారు. మౌలిక సదుపాయా ల పనులు పూర్తికాగానే లబ్ధిదారులుప్రభుత్వం కేటాయించిన తమ తమ ఇం డ్లకు వెళ్లే విధంగా కృషి చేయాలని కోరారు. గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణ పనులు పూర్తిచేసుకుని నిర్మానుష్యంగా ఉండటం పట్ల అభ్యంత రం వ్యక్తం చేశారు. అనంతరం వినాయక మండపం వద్ద విఘ్నేశ్వరునికి ఎమ్మెల్యే కోరం కనకయ్య, తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చ ర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, ఇల్లందు మార్కెట్ కమిటీ అధ్య క్షులు బి.రాంబాబు, కామేపల్లి సొసైటీ ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసి డెంట్ దమ్మాలపాటి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో పూజ లు నిర్వహి ంచారు. ఉత్సవ కమిటీ సభ్యు లు, భక్తులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సిహెచ్ సుధాకర్, ఎస్సై బి.సాయికుమార్, పంచాయతీ కార్యదర్శి గోపిక, జిల్లా కాంగ్రెస్ నాయకులు తోటకూరి శివయ్య, మాజీ ఎంపీపీ మాలోత్ సరిరామ్ నాయక్, మాజీ సర్పంచ్ సపవట్ శంకర్, ఐటీడీఏ ఏ ఈ మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్ తదితరులు పాల్గొ న్నారు.



## నేరాలు-దారుణాలు

# నానో యూరియా, నానో డి ఏ పి ఉపయోగాలపై రైతులకు అవగాహ పెట్టుబడి తక్కువ...

### దిగుబడి ఎక్కురైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

### మోతాదుకు మించి యూరియాను వాడొద్దు

### కామేపల్లి ఏవో భూక్య తారా దేవి

*కామేపల్లి,ఆగష్టు 29 ప్రభాతవార్త :*

కామేపల్లి లో రైతులకు పత్తి,వరి,మిరప పంటలపై నానో యూరియా,నానో డి ఎ పి ఉపయోగాల పై మండల వ్యవసాయ అధికారి బి.తారా దేవి శుక్రవారం అవగా హన కల్పించారు. వ్యవసాయంలో నూత నంగా వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నాన్ని రైతులు అలవర్చుకోవాలని అప్పుడే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక పంటల దిగుబడి పెరిగి అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. నానో డిఏపి, నానో యూరియా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు



చేయబడిన ప్రత్యేక రకమైన ద్రవరూప మైన ఎరువు ద్వారా మొక్కల పత్రాల రంధ్రాల ద్వారా పోషకాలు నేరుగా మొక్క లోకి వెళ్లడం ద్వారా పంటలు దిగుబడిపై గణనీయమైన సానుకూల ప్రభావం చూ పే అవకాశం ఉందని తెలిపారు. ప్రారంభ దశలో మొక్కలకు భాస్వరం ఎరువులు వాడడం ద్వారా వేరు వ్యవస్థ పటిష్టంగా ఉంటుందని వేరు వ్యవస్థ బాగా పెరిగిన ప్పుడే పంటలు ఏపుగా పెరిగి మంచి దిగుబడి ఇచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు. బాస్వరం ఎరువుల ద్వారా పూత దశలో కూడా మంచి సానుకూల ప్రభా వం ఉండే అవకాశం ఉంటుందని క్షేత్ర స్థాయిలో రైతులు మోతాదుకు మించి ముఖ్యంగా రసాయన ఎరువులు అయిన 20.20.0.13, డిఏపి, యూరియా లను మోతాదుకు మించి వాడడం ద్వారా నేల కాలుష్యంతో పాటుగా రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయని, అదేవిధంగా సాంప్రదాయ పద్ధతిలో గుళికల రూపంలో వేసినటువంటి ఎరువుల్లో కేవలం 30 నుంచి 40!! మాత్రమే పంట తీసుకోవ డం జరుగుతుందన్నారు. మిగతా ఎరువు లు వృధాగా పోయే అవకాశం ఉంటుంద ని ఈ నానో టెక్నాలజీ ద్వారా తయారు చేసిన నానో యూరియా,నానో డిఏపి విధానంలో పత్ర రంధ్రాల ద్వారా భాస్వ రం ఎరువులు మొక్కలకు 70 నుంచి 80 శాతం సంగ్రహించడం ద్వారా ఎరువుల ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి రై తుకు పంట దిగుబడిలో మంచి ప్రభావం చూపుతుందని తెలిపారు. రైతుకు అతి తక్కువ ఖర్చుతో ఈ ద్రవరూప ఎరువులు వాడడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై వ్యవసాయ శాఖ ద్వారా క్షేత్రస్థాయిలో విస్తృతంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ నరసింహం, రైతులు అంతోటి అచ్చయ్య, అజ్మీర రాందాస్, కొర్ర రాములు, దుగ్గి కృష్ణ, అజ్మీర శంకర్, అజ్మీరా రమే ష్, అజ్మీర అర్జున ,కంపసాటి సురేష్, హనుమంతు, శ్యాము తదితరులు పాల్గొ న్నారు.

# నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

### ఎంపీడీవో జీ.రవీందర్

*కామేపల్లి, ఆగష్టు 29 ప్రభాతవార్త :*

కామేపల్లి మండ ల ప్రజా పరిషత్ కార్యాలయం లో శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిధిలోని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రవీందర్ శుక్రవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ముసాయి దా ఓటర్ల జాబితా పై సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు రోడ్ల దుస్థితి పై పెల్లుబికిన నిరసన

-సిపిఎం ఆధ్వర్యంలో వందలాది మంది రోడ్డుపై

బైఠాయింపు భారీ రాస్తారోకో

-భారీగా నిలిచిన వాహనాలు

-అధికారుల హామీతో ఆందోళన విరమించిన నేతలు

-ఇసుక లారీలు ఆపాలి...శాశ్వతంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్



*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

దుమ్ముగూడెం మండలం ములకపాడు సెంటర్ లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో ఇసుక లారీల వల్ల ధ్వంసమైన భద్రాచలం,వెంకటాపురం ప్రదాన రహదారి శాశ్వత నిర్మాణం చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం దుమ్ముగూడెం,చర్ల, భద్రాచలం కమిటీల ఆధ్వర్యంలో వందలాది మంది ప్రజలు ములకపాడు సెంటర్ లో రహదారి పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, జిల్లా అధికారులు భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు రోడ్డు పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఇసుక లారీలు ఓవర్ లోడ్‌తో రవాణా అవడం వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందన్నారు. రోడ్డు కు శాశ్వత మరమ్మత్తులు చేయకపోవడం వల్ల వందమంది ప్రజలు రోడ్డు ప్రమాదంలో మరణించారన్నారు. ప్రభుత్వం ఇసుక అమ్మకం ద్వారా కోట్లాది రూపాయలు ఆర్జిస్తూ రోడ్డు నిర్మాణం మరచిందని విమర్శించారు. గతంలో ఎన్నడూ కూడా నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్ల సమస్యలతో ప్రజలు భాదపడలేదన్నారు, ఎమ్మెల్యే భాద్యత వహించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రహదారి నిర్మాణానికి నిధులు సాదించాలని కోరారు. ప్రజల ప్రాణాలు పోతుంటే జిల్లా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదని నాయకులు తేల్చి చెప్పడంతో ఆందోళన ఉధృత రూపం దాల్చింది. పోలీసులు జోక్యం చేసుకుని అధికారులతో, సిపిఎం నాయకులతో చర్చలు జరిపారు. దుమ్ముగూడెం తహసీల్దార్ మామిడి అశోక్‌కుమార్ ఆందోళన వద్దకు వచ్చి ఇసుక లారీలు భద్రాచలం వైపు రాకుండా చర్యలు తీసుకుంటామని, రోడ్డు నిర్మాణం పూర్తి చేసే ,సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చిన తర్వాత ఆందోళన తాత్కాలికంగా విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు ఎలమంచి రవికుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సా రెడ్డి, కారం పుల్లయ్య,రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం స్వామి,ఎలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, సున్నం గంగ,కొర్సా చిలకమ్మ, బండారు శరత్ బాబు, చర్ల మండల కార్యదర్శి మచ్చా రామారావు, యలమంచి శ్రీను బాబు, బొల్లి సత్యనారాయణ,సరియం కోటేశ్వరరావు, కొమరం చంటి,బందెల చంటి, నవీన్, సమ్మక్క, తాటి నాగమణి, శ్యామల చంద్రం, ముత్తయ్య,డి.లక్ష్మి, లీలావతి, నాగరాజు, జ్యోతి,కనకశ్రీ,భూపేందర్, రామకృష్ణ,కుంజ శ్రీనివాస్, వాగే ఖాదర్ బాబు, రవి, గుడ్ల సాయి రెడ్డి,మర్మం సమ్మక్క, రామ్మోహన్ రెడ్డి, అచ్చిరాజు, కాక కృష్ణ, ఇంక తదితరులు పాల్గొన్నారు.




# గణపతి మండలాలను సందర్శించిన బీజేపీ నేతలు

*భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :*



భారతీయ జనతా పార్టీ భద్రాచలం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని గణపతి నవరాత్రులు జరుగు వ ం డ పా ల న ు సందర్శించి వినాయక చవితి ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ కుంజా ధర్మ, మండల అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు మూలిశెట్టి రామ్మోహన్ రావు, మండల ఉపాధ్యక్షులు షేర్ శ్రీనివాస్, ఓబిసి మోర్చా డివిజన్ నాయకులు దేవరపల్లి వెంకటేశ్వరరావు, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ములిశెట్టి నిఖిల్, జిల్లా కార్యదర్శి అన్నం హరీష్, మండల అధ్యక్షుడు అన్నం సాయి లక్ష్మణ్, త్రిబుల్ ఎక్స్ చక్రవర్తి, గురుమూర్తి, గిరీష్ ఓగిరాల సాయిప్రసాద్, తరుణ్, దినేష్,వేణు, బాలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుకు దోహదపడతాయి

- పినపాక శాసనసభ్యులు పాయం



*బూర్గంపహాడ్ ,ఆగస్టు30,ప్రభాత వార్త:*

సంక్షేమ పథకాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుకు దోహదపడతాయని పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సుమారు రూ. 85 లక్షల రూపాయల అంచనావ్యయంతో సారపాక పరిధిలోని,రాజీవ్ నగర్ కాలనీ, గాంధీనగర్,భాస్కర్ నగర్, ఒడియా క్యాంపు,బొగ్గుసూర గుట్ట కాలనిప్రాంతాలలో పలు సీసీ రోడ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారపాక పంచాయతీలో ఉన్నటువంటి ప్రతి మారుమూల మట్టి రోడ్ల సైతం సీసీ రోడ్లుగా నిర్మాణం చేపట్టడమే కాకుండా, డ్రైనేజీ కోసం నిధులు కేటాయించి పూర్తి చేస్తామన్నారు, అదేవిధంగా విద్యుత్ సమస్య లేకుండా కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి దశలవారీగా విద్యుత్తు స్తంభాల ఏర్పాటు, అవసరమైన చోట ట్రాన్స్ఫార్మర్ లో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మండల పరిధిలోని నాగినేని ప్రోలు రెడ్డిపాలెం, కృష్ణ సాగర్ , ముసలిమడుగు, రామాపురం రైతుల పంట పొలాల కొరకు విద్యుత్ సబ్ స్టేషన్ అవసరం నిమిత్తం సందేళ్ల రామాపురం ప్రాంతంలో స్థల సేకరణ, ఐసిడిఎస్ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతుందని దానికి వెంటనే నిధులు కేటాయిస్తానని ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. నిరుపేద వికలాంగులు ఇందిరమ్మ ఇల్లు రానివారు వివరాలను వెంటనే రెండో లిస్టులో మొదటి పేరుగా అలాంటి వారిని చేర్చాలని అధికారులకు సూచించారు.మండల అభివృద్ధి విషయంలో తాను వెనకడుగు వేసేది లేదని అన్నారు. సారపాక పంచాయతీతో పాటు మండలంలోని 17 పంచాయతిలలో కూడా మాస్టర్ ప్లాన్ తో అభివృద్ధి దిశగా నిధులు కేటాయించి పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని గుర్తు చేశారు. పార్టీ నాయకులు సమన్వయంతో కలిసికట్టుగా ఉండాలని ఎలాంటి విభేదాలకు వెళ్లకుండా నిత్యం ప్రజలతో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని ప్రజల మన్నులు పొందిన వారే ప్రజాప్రతినిధిగా ఉండే అవకాశం వస్తుందని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసినటువంటి ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని భరోసా నిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మరొకవైపు గ్రామీణ ప్రాంతంలో చేసినటువంటి అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి దోహదపడతాయన్నారు. సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించే తీసుకుంటానని మరోసారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, జిల్లా మైనారిటీ సంఘం అధ్యక్షులు మహిమ్మద్ ఖాన్, పినపాక బి బ్లాక్ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు బర్ల నాగమణి, తాసిల్దార్ కే ఆర్ కె వి ప్రసాద్ ,మండల అభివృద్ధి అధికారి జమలారెడ్డి, సిడిపిఓ రేవతి, పంచాయతీరాజ్ డి ఈ వెంకటేశ్వర్లు, ఏఈ చంద్రశేఖర్, హౌసింగ్ ఈఈ సత్యనారాయణ, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంగువ రమేష్, దారం రమేష్ రెడ్డి, తిరుపతి సంటి, లాలయ్య, నాగరాజు, వెంకటనారాయణ, మోహన్ రావు,మహిళ నాయకులు రేణుక,దేవి, సిపిఐ పార్టీ నాయకులు పేరాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీ

*భద్రాచలంటౌన్, ఆగస్టు 29, ప్రభాతవార్త :*

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష (టిఎస్ఎస్) తెలంగాణ, భారత కృత్రిమ అవయవాల ఉపకరణాల సంస్థ (అలిమికో) సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు ఉచిత పరికరాలు ఉపకరణాల పంపిణీ కోసం నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈఓ తోటమల్ల రమ శుక్రవారం తెలిపారు. ఈ శిబిరం ఈ నెల 30వ తేదీతో పాటు సెప్టెంబర్ 1, 2 తేదీలలో కొత్తగూడెం మండలంలోని ఆనందఖని జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. 18 ఏళ్ల లోపు వయసు గల దివ్యాంగ పిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన పరికరాలు, ఉపకరణాలు అందజేయనున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ప్రభుత్వం మంజూరు చేసిన దివ్యాంగ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా రేషన్ కార్డు, ఆధార్ కార్డు, యూడిఐడి కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని దివ్యాంగ పిల్లలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు కూడా ఈ విషయాన్ని మరింత మందికి తెలియజేయాలని ఆమె కోరారు. అదనపు సమాచారం కోసం ఎస్ పద్మావతి 770 2779801, ఆర్ సుమలత 9014705822 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

# శివనాగస్వామి ఔదార్యం

-అన్నదాత ఆకలి తీర్చిన వైనం

-వెల్లువెత్తిన ప్రశంసల పర్వం

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*





మహేశ్వరుడికి పరమ భక్తితత్వం ... వృత్తి ఉపాధ్యాయుడు ... ప్రవృత్తి సేవా తత్పరుడు ... ఆయన పేరు తెలియని వ్యక్తి లేరంటే అతిశయోక్తి కలుగకమానదు... కారణం ఆయన చేసే సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అటువంటివి ... ఆయనే ద్వాదశ జ్యోతిర్లింగక్షేత్రం చిన్నఅరుణాచలం వ్యవస్థాపకుడు శివనాగస్వామి. తాజాగా మనిషి ఆకలి తీర్చడానికి వరి పండించే రైతుకే ఆకలి తీర్చి భళా అనిపించి మరో విశిష్ట సేవా కార్యక్రమాన్ని నిర్వహించాడు శివనాగస్వామి. వివరాలలోకి వెళితే ... దుమ్ముగూడెం మండలం నర్సాపురం యూరియా సొసైటీ వద్దకు యూరియా కోసం దూరప్రాంతాల నుంచి వచ్చి పడిగాపులు కాస్తున్న రైతులను చూసి చలించిన శివనాగ స్వామి చిన్నఅరుణాచలంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగంగా రైతులకు కూడా వడ్డించారు. దీంతో అన్నప్రసాదం రూపంలో రైతులు ఆకలి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శివనాగస్వామి మాట్లాడుతూ .. ఈ సేవా కార్యక్రమాన్ని యూరియా పంపిణీ చివరి రోజు వరకు కొనసాగిస్తామని తెలియజేశారు.దీంతో పలువురు వక్తలు శివనాగస్వామిపై ప్రశంసల జల్లు కురిపించారు.

# ఉల్లాస్ వాలంటరీలకు శిక్షణ

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*



దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరం గ్రామపంచాయతీ పరిధిలో ఉల్లాస్ వాలంటరీలకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల రిసోర్స్ పర్సన్ మల్ల మోహన్ కుమార్,గ్రామ రిసోర్స్ పర్సన్ బొడ్డు నాగేశ్వరరావు, గ్రామ వీవోఏ కమల, ఉపాధ్యాయురాలు హైమావతి పాల్గొనగా..ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల రిసోర్స్ పర్సన్ మల్ల మోహన్ కుమార్ మాట్లాడుతూ లక్ష్మీనగరం గ్రామపంచాయతీలో నిరక్షరాస్యులకు చదవడం రాయడం నేర్పించి.. చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి లక్ష్మీనగరం గ్రామ పంచాయతీ పరిధిలో నిరక్షరాస్యులను అక్షరాస్య లుగా మార్చాలని సూచించారు. .ప్రభుత్వం చేపట్టిన "ఉల్లాస్ ప్రోగ్రాం"ను విజయవంతం చేయడానికి అందరం కృషి చేస్తామని గ్రామపంచాయతీ పరిధిలో గల కే.దుమ్ముగూడెం, కన్నాపురం, లక్ష్మీనగరం గ్రామ వాలంటీర్లు తెలిపారు.

# న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో న్యాయాధికారికి ఘన సన్మానం

కొత్తగూడెం లీగల్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:

కొత్తగూడెం మూడవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వనం వినయ్‌కుమార్‌ను జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షుడు రామిశెట్టి రమేష్ న్యాయాధికారి వినయ్‌కుమార్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ దీకొండ రవికుమార్, ట్రెజరర్ లగడపాటి సురేష్, అసోసియేట్ ప్రెసిడెంట్



నిమ్మల మల్లికార్జున్, ఉపాధ్యక్షులు ఈ. మీనాకుమారి, జి. ప్రమీల, జాయింట్ సెక్రటరీ హెచ్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన న్యాయధికారి వినయ్

కొత్తగూడెం లీగల్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:



కొత్తగూడెం మూడవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా వనం వినయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని ఓల్డ్ మలక్‌పేట్‌కు చెందిన వనం వినయ్‌కుమార్ కొత్తగూడెం మూడవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా నియమితులయ్యారు. ఈ క్రమంలో ఆయన రెండవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.రవికుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం వినయ్‌కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన మెజిస్ట్రేట్ దుర్గా భవాని

కొత్తగూడెం లీగల్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:



భద్రాచలం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా దుర్గా భవానిశుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు హైదరాబాద్ పంజాగుట్టలోని శ్రీనగర్ కాలనీకి చెందిన దుర్గా భవాని భద్రాచలం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా నియమితులయ్యారు. శుక్రవారం ఆమె భద్రాచలం ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. శివ నాయక్ నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ దుర్గా భవాని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# డీఆర్‌డీఏ సెర్ప్ ఉద్యోగులకు కౌన్సిలింగ్

**- పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్**

కొత్తగూడెం, ఆగస్టు 29 – ప్రభాతవార్త:





గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) డీఆర్‌డీఏ కొత్తగూడెం జిల్లాలో సీఈవో, సెర్ప్ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో ఈఆర్‌డీవో సిబ్బందికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్ ప్రక్రియలో కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా డీఆర్‌డీవో విద్యాచందన, ఎంబర్‌గా అదనపు డీఆర్‌డీవో నీలయ్యలు వ్యవహరించారు. జిల్లాలోని 22 మండలాలకు గాను 83 సీసీ క్లస్టర్లలో 93 మందికి సీనియార్టీ ప్రకారం కౌన్సిలింగ్ నిర్వహించారు. సీనియార్టీ ప్రకారం స్పౌస్, 70 శాతం డిజేబిలిటీ, వితంతవులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి, పిల్లలకు ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను కలిగిన వారికి ప్రాధాన్యత కల్పిస్తూ కౌన్సిలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ కౌన్సిలింగ్‌లో ఏవో వెంకటలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

# వాస్తవ లాభాలను ప్రకటించి 35 శాతం వాటా ఇవ్వాలి...

**- కార్మికుల సమస్యలపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో జీఎంకు వినతి**

రుద్రంపూర్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ ఆధ్వర్యంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కొత్తగూడెం ఏరియా జీఎం శాలెం రాజుని కలిసి మెమోరాండం అందజేశారు. వాస్తవ లాభాలను ప్రకటించి లాభాలపై 35శాతం వాటా ప్రకటించాలని, కార్మికులకు ఆదాయ పన్ను రద్దు చేయాలని, పేర్క్స్ మీద పన్ను యజమాన్యమే చెల్లించాలని అన్నారు. అనారోగ్య సమస్యలతో మెడికల్ బోర్డుకు వెళ్లే కార్మికులందరికీ అన్ఫిట్ చేయాలని, జూలై నెలలో ఫిట్ ఫర్ సేమ్ జాబ్ ఉత్తర్వులు ఇచ్చిన 50 మందికి తిరిగి మెడికల్ పిలిచి వారందరిని అన్ఫిట్ చేయాలని అన్నారు. వేలంపాటతో సంబంధం లేకుండా సింగరేణి నూతన బొగ్గు గనులను కేటాయించాలని, సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన 43 వేల కోట్ల రూపాయల బకాయిలను సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు మంత్రులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. మెడికల్, ట్రైనింగ్ అయిన డిపెండెంట్‌లకు వెంటనే నియామక పత్రాలు ఇవ్వాలని, అంశాలపై కాపుకృష్ణ మాట్లాడారు. సీఎండీకి ఈ మెమోరాండం పంపి వెంటనే సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూడాలని జీఎంను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య,సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ మాదాసు ఈశ్వరరావు, గిన్నారపు ఎంటెక్ మహేందర్, బ్రాంచ్ సెక్రటరీలు మారపాక తిరుపతి, కొమరవెల్లి అశోక్, ఫిట్ సెక్రెటరీ నమిల్ల వెంకటేశ్వర్లు, గాద సుజా శ్రీనివాసరావు, కె శివప్రసాద్, తదితరులు పాల్గొని మెమోరాండం ఇవ్వడం జరిగింది.

# పాలిటెక్నిక్ కాలేజీకి పూలకుండీలు, మొక్కలు అందజేత

రుద్రంపూర్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:

లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం ఆధ్వర్యంలో స్థానిక కొత్తగూడెం పాలిటెక్నిక్ కళాశాలలో 30 కుండీలు క్రోటన్ మొక్కలను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకుల సమక్షంలో అందజేశారు. ఈకార్యక్రమానికి ప్రోగ్రామ్ చైర్ పర్సన్ లయన్ సంఘం వెంకట పుల్లయ్య అధ్యక్షతన వీటిని అందించారు. లయన్స్ క్లబ్ తరపున చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈకార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ లయన్



బొక్క శ్రీనివాస్, సెక్రటరీ నమిళ్ల నరేష్, ట్రెజరర్ పగడాల నాగేశ్వరావు, క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ లయన్ గబ్బుట రాజయ్య, విజయలక్ష్మీ, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ లయన్ మండల రాజేశ్వరరావు, శరత్ బాబు పాల్గొన్నారు.




**చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్**

# తల్లితండ్రుల త్యాగాలు వృధా కాకుండా విద్యనభ్యసించాలి...

**- కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు సాధ్యమే..**

**- డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఓరియంటేషన్‌లో జిల్లా కలెక్టర్ పాటిల్**

కొత్తగూడెం, ఆగస్టు 29 – ప్రభాతవార్త:



తల్లిదండ్రుల త్యాగాలు వృధా కాకుండా విద్యార్థులు చదువును అభ్యసించి,ఉన్నత స్థాయికి చేరాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన ఇంజనీరింగ్, బిఎస్సి మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కాకతీయ యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ వి రామచంద్ర, జియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్య కోసం ఇంటి నుండి దూరంగా పంపే సమయంలో అనేక అపోహలు కలిగి ఉంటారని, ఎలాంటి అపోహలు ఉంచకుండా విద్యార్థులను స్వేచ్ఛనిచ్చి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు మంచి పేరు సంపాదించగలరని ఆయన సూచించారు. ప్రతి సంవత్సరం ఇంజనీరింగ్ డే ను అందరం ఘనంగా నిర్వహిస్తామని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల లేసి నివాళులు అర్పిస్తామన్నారు. కానీ ఆయన ఏ కళాశాల నుండి విద్యనభ్యసించారు, వారి యొక్క గురువులు గురించి ఎవరికీ తెలియదని ఆయన తెలిపారు. 1861 లో కర్ణాటకలో జన్మించి ఇంజనీరింగ్‌లో ప్రతిభ కనబరిచి దేశానికై గర్వకారణ మైన అనేక ప్రాజెక్టులను రూపొందించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆధునిక సదుపాయాలు లేనప్పటికీ ఆయన కృషి, నిబద్ధతే నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ తాను విద్యనభ్యసించేటప్పుడు ఎటువంటి సదుపాయాలు లేవని కిలోమీటర్ల దూరం నడిచి విద్యనభ్యసించే వాళ్ళమని కానీ మంచి ఉపాధ్యాయులు, ల్యాబ్ సౌకర్యాలు ఉండటం వల్ల నైపుణ్యం సాధించి ఈ స్థాయికి చేరుకోగలిగామని ఆయన అనుభవాలు విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థులు పుస్తకాలతో పాటు ప్రత్యక్ష అనుభవాల ద్వారా నైపుణ్యాన్ని సాధించాలని ఆయన తెలిపారు. విద్యార్థులకు ఆయన తాను విద్యార్థి దశలో అనుభవాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యూనివర్సిటీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వసతి గృహాలు ల్యాబ్లు ఆడిటోరియం మరియు క్రీడా మైదానం వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ మన జిల్లాలో స్థాపించడానికి గల కారణం జిల్లాలో కోల్ మైన్స్, హెవీ వాటర్ ప్లాంట్, వేడి నీటి గుంతలు వంటి జియోలాజికల్ వైవిధ్యం ఉండటం వలన ఈ యూనివర్సిటీ ఇక్కడ స్థాపించడం జరిగిందని దీని ద్వారా విద్యార్థులు జియాలజీలో ప్రత్యక్షంగా అధ్యయనం చేయడం ద్వారా నైపుణ్యం సాధించవచ్చు అని తెలిపారు. విద్యను అభ్యసించిన అనంతరం దేశ విదేశాల్లో విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాము, కళాశాల ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిబాపూలే కళాశాలలో నిర్వహించిన తెలుగు భాషా జాతీయ క్రీడా దినోత్సవాలు

- క్రీడల్లో రాణించాలి.. మాతృభాషను గౌరవించాలి..
- మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల ప్రిన్సిపాల్
- బురాన్ గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్

**చిత్రపటాలకు పూలమాలలు వేసిన అధ్యాపక బృందం**



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 29(ప్రభాతవార్త):**

అన్నపురెడ్డిపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల కళాశాల్లో తెలుగు భాష దినోత్సవం...జాతీయ క్రీడా దినోత్సవంను ఘనంగా శుక్రవారం నిర్వహించారు. హాకీ లెజెండ్ ధ్యాన్ చంద్,తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు అధ్యాపకబృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు.భారతదేశ క్రీడా సంస్కృతిలో భాగంగా భారత హాకీ దిగ్గజుడు.హాకీ మాంత్రికుడుగా పేరొందిన మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని.జాతీయ క్రీడా దినోత్సవంను జరుపుకుంటామన్నారు.క్రీడా దినోత్సవంను ఉద్దేశించి.కళాశాల ప్రిన్సిపల్ ఎస్కే బురాన్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ ఒలింపిక్స్లో భారత జట్టు అద్భుతమైన ప్రదర్శన చేయడంలో కీలకపాత్ర పోషించి.బంగారు పతకాలతో అరుదైన రికార్డులను సాధించారన్నారు.ధ్యాన్ చంద్ భారత ఆర్మీకి చేసిన సేవలను కూడా ఈ సందర్భంగా స్మరించుకున్నారు.విద్యార్థులకు క్రీడల ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేసి.భవిష్యత్తులో ఒలంపిక్స్లో పాల్గొనే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.తెలుగు భాష దినోత్సవంను ఉద్దేశించి మాట్లాడుతూ తెలుగు భాషోద్యమానికి మూల పురుషుడిగా ప్రసిద్ధి చెందిన గిడుగు వెంకట రామ్మూర్తి జన్మదినాన్ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటామన్నారు.తెలుగు భాషా సేవకై గిడుగు వెంకట రామమూర్తి చేసిన సేవలను కొనియాడుతూ... తెలుగు భాషా గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించి. మాతృభాష పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఏటీపీ రాంబాబు, డిప్యూటీ వార్డెన్ మధు, పీడీ డాక్టర్ రఘువరన్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## అక్రమ డిప్యుటేషన్లు నిలిపివేయాలని వినతి

**పాల్వంచ టౌన్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:**



టీజీ జెన్కోలోని విద్యుత్ అధికారుల అక్రమ డిప్యూటేషన్లు నిరసిస్తూ, సీనియర్ ఇంజనీర్స్ రిక్వెస్ట్ ట్రాన్స్ఫర్లు చేయాలని కోరుతూ శుక్రవారం కేటీపీఎస్ 5,6 దశల సీఈ ఎం ప్రభాకర్ రావు కి తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కేటిపిఎస్ బ్రాంచ్ సెక్రటరీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. విద్యుత్ సౌధ, హైదరాబాద్కి ఇచ్చిన డిప్యుటేషన్ ఆర్డర్స్లో సీనియారిటి ఫాలో అవ్వకుండు జూనియర్ ఇంజనీర్స్కు ట్రాన్స్ఫర్స్ ఇచ్చారని, ప్రస్తుత ఇచ్చిన డిప్యూటేషన్ ఆర్డర్స్ కాన్సర్ చేసి సీనియారిటి ప్రకారంగా మెడికల్, స్పౌస్, పర్సనల్ ట్రాన్స్ఫర్స్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కేటి పీ ఎస్ 5,6 దశల బ్రాంచ్ సెక్రటరీ ఉమామహేశ్వరరావు, జయబాస్కర్, శ్రీనివాసరావు, చంద్ర కళాదర్, ప్రదీప్, దివాకర్, పావని, రజిత, శ్రావణ్, కృష్ణ, చంద్రశేఖర్, హరీష్, బాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూఇందిరా ప్రియదర్శిని విద్యార్థులను అభినందించిన కలెక్టర్

**పాల్వంచ టౌన్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:**



13వ నేషనల్ స్పోర్ట్స్ డే మేజర్ ధ్యాన్చంద్ జన్మద్నిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడలు స్పోర్ట్స్ అధికారి పరమానంద రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ క్రీడల్లో భాగంగా స్థానిక న్యూ ఇందిరా ప్రియదర్శిని విద్యార్థులు హాకీ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనపరచి తృతీయ స్థానాన్ని చేజిక్కించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ చేతులమీదుగా పతకాలను తీసుకున్నారు. గెలుపొందిన విద్యార్థులను కేఎల్ఆర్ విద్యా సంస్థల అధినేత్రి కె. నాగమణి, పాఠశాల ప్రిన్సిపల్ బి. సుమతి, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పేరు ప్రతిస్తులు తీసుకురావాలని కోరారు.

## వినాయక మంటపంలో కుంకుమ పూజలు

**పాల్వంచ టౌన్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:**



వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్మించినటువంటి పందిరిలో శుక్రవారం 200 మంది మహిళలచే లక్ష్మీ అమ్మవారికి విఘ్నేశ్వర స్వామి వారి సమక్షంలో కుంకుమ పూజలు, అష్టోత్తరం, లలిత సహస్రనామాలు నిర్వహించారు. పాల్వంచ అంతా బాగుండాలి అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని వేద పండితులు నాని శర్మచే పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం కన్వీనర్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు చలవాది ప్రకాష్, ఉత్సవ కమిటీ మహిళ అధ్యక్షులు పెండ్యాల రోజాలక్ష్మీ, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి గూడెపు శ్రీనివాస్, వర్తక సంఘం అధ్యక్షులు పెండ్యాల కృష్ణ, గద్దల కళ్యాణి, మోనిక, దీప్తి, సౌజన్య, అశ్విని భారతి, సుష్మ, రాధిక, ధనలక్ష్మీ, పాల్గొన్నారు.

## వినాయక మంటపంలో యువ హీరో పూజలు

**పాల్వంచ టౌన్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:**





వినాయక చవితి పండుగ సందర్భంగా మూడో రోజు శుక్రవారం చింత చెట్టు గణపతి నవరాత్రులను బిల్డింగ్ కన్స్ట్రక్షన్ ఆల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నవరాత్రులు జరుగుతున్నాయి. శుక్రవారం రోజు పాల్వంచకు చెందిన యువ హీరో కోరే చిన్ను వినాయక ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన తొలిసారిగా ఐ లవ్ యు రా అనే సినిమాలో హీరోగా నటించగా సెప్టెంబరు ఐదవ తారీఖున విడుదల కానుంది. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ మాజీ కార్యదర్శి కొమ్మవరపు ఆదాము బిల్డింగ్ కన్స్ట్రక్షన్ ఆల్ వర్కర్స్ యూనియన్ ఏ ఐ టి యు సి అధ్యక్షుడు ఉత్సవ కమిటీ సభ్యులు కోరే కృష్ణ ధారావత్ గోపి, నంది కోటయ్య, పెనుమూడి పున్నారావు, రామడుగు రామాచారి, సంకుంతుల రామకృష్ణ, జనోదు శంకరాచారి, కాసుల రమేష్, నల్లి సురేష్, కాసర్ల రామారావు, బండారు రమణ, బురుజు కింది రమేష్ అరెళ్ళ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు




## చుంచుపల్లి మండల ప్రెస్ క్లబ్ ఏర్పాటు...

**చుంచుపల్లి, ఆగస్టు 29 – ప్రభాతవార్త:**







సీనియర్ జర్నలిస్టు సమక్షంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండల ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా గుణ సురేష్ (ఆంధ్రజ్యోతి), కార్యదర్శి సాంసన్ రాజు, ట్రెజరర్ అరుణ్ (నమస్తే తెలంగాణ), సహాయ కార్యదర్శి1 స్వామి (మన తెలంగాణ), సహాయ కార్యదర్శి2 కిరణ్ కుమార్ (ఆంధ్రప్రభ), గౌరవ అధ్యక్షులుగా సీనియర్ పాత్రికేయులు వాహబ్ (నవ భూమి),రాము (సాక్షి), షఫీ (సూర్య),గౌరవ సలహాదారులు గా డివి (నవతెలంగాణ),శంకర్ (వార్త),ప్రభాకర్ రెడ్డి,శివ శంకర్ (దిశ), అశోక్ (ప్రజా జ్యోతి),అఫ్జల్ (తెలంగాణ వాణి),క్రమశిక్షణ కమిటీ సభ్యులు గా రాజేందర్ (వెలుగు),శివమూర్తి (మనం),హరి (ప్రజాతంత్ర),ప్రసాద్ (మెట్రో),జాన్సన్ డేవిడ్ బాబు (సూర్య) లను ఎన్నుకోవడం జరిగింది.

## వినాయక మంటపంలో మాజీ ఎంపీటీసీ పూజలు

**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 29 – ప్రభాతవార్త:**



మండలంలోని శ్రీనగర్ కాలనీ వినాయక మంటపంలో శ్రీనగర్ సీనియర్ మాజీ ఎంపీటీసీ కొల్లు పద్మ ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలందరూ అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కొల్లు నాగేశ్వరరావు, ఆగశ్రీ, రమాదేవి, పద్మావతి, రాజమ్మ, శారద, శ్రవంతి, సుజాత, కల్యాణి, శోభారాణి, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

## త్రివేణిలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 29 – ప్రభాతవార్త:**

స్థానిక లక్ష్మీదేవిపల్లిలోని త్రివేణి పాఠశాల ప్రాంగణంలో హాకీ క్రీడాకారులు మేజర్ ధ్యాన్చంద్ 120వ జయంతిని నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. ప్రతీ విద్యార్థి క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గొల్లపూడి జగదీష్, సీఆర్వో కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్స్ సూర్యనారాయణ మూర్తి, శ్రీనివాస్సింగ్, నేతాజీ, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య, ఫాతిమా, నాగరత్నం, శ్రీనివాస్రెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.



# తిరుమలాపురంలో తాసిల్దార్ నాగేశ్వరావు ఆస్తులుపై ఏసీబీ సోదాలు

**- పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడి**



**చింతకాని ప్రభాతవార్త ఆగస్టు 29 :**

వరంగల్ పోర్ట్ మండలము తాసిల్దార్ గా పనిచేస్తున్న బండి నాగేశ్వరరావు ఆస్తులు పై శుక్రవారం ఏసీబీ సోదాలు నిర్వహించింది బండి నాగేశ్వరరావు సొంత గ్రామమైన తిరుమలాపురం లో తనిఖీలు చేపట్టారు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినడనే సమాచారంతో బండి నాగేశ్వరరావు స్వగ్రామం తిరుమలాపురం గ్రామంలో నిర్మించిన తన ఇంటిపై అదేవిధంగా అనంతసాగర్ లో నిర్మించిన కోళ్ల ఫారంలో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలు నాగేశ్వరావుకు సంబంధించిన పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా తాసిల్దార్ నాగేశ్వరరావుకు సంబంధించి విలాసవంతమైన భవనం 17.10 ఎకరాల వ్యవసాయ భూమి, 700 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇతర వెండి వస్తువులు, రెండు కార్లు ఒక ద్విచక్ర వాహనం తోపాటు పలు వరాస్తులు గుర్తించడం జరిగిందని, వీటి విలువ ప్రాథమికంగా అంచనా వేసిన మేరకు సుమారు రూ.5.50 కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు తమ దర్యాప్తు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. తాసిల్దార్ నాగేశ్వరావు పై అక్రమాస్తుల కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

# ముదిగొండలో కోతులు, కుక్కల బెడదపై సీపీఎం నేతృత్వంలో ఆందోళన



**ముదిగొండ, ప్రభాతవార్త ఆగస్టు 29:**

ముదిగొండ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆందోళనలో తెలిపారు. ఈ సమస్యకు తక్షణ పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేశారు.తరువాత గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేసి, కోతులు, కుక్కల బెడద నివారణకు సమర్థమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్తుల భద్రతకు, పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల అధ్యక్షులు బట్టు పురుషోత్తం, మాజీ వైస్ ఎంపీపీ, రాజు సిపిఎం నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సూర్య విక్రమాదిత్య పుట్టినరోజు వేడుకలు



**ముదిగొండ ప్రభాతవార్త ఆగస్టు 29:**

మండల పరిధిలోని వల్లభి గ్రామంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బిచ్చాల అన్వేష్ ఆధ్వర్యంలో, గ్రామ కాంగ్రెస్ నాయకుల సహకారంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క-నందిని విక్రమార్క దంపతుల తనయుడు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మల్లు సూర్య విక్రమాదిత్య పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ గవర్నమెంట్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో సూర్య విక్రమాదిత్య రాష్ట్ర రాజకీయాలలో రాణించాలని, సుఖశాంతులతో ఉండాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలూరి భాస్కర్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు పిల్లుట్ల రాఘవ, షేక్ గుడ్ సాహెబ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చేకూరి రామారావు, యువజన కాంగ్రెస్ నాయకులు దరిపల్లి వెంకటేష్, సురపల్లి అనిల్, సురపల్లి వీరబాబు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా సూర్య విక్రమాదిత్య జన్మదిన వేడుకలు



**బోనకల్, ప్రభాతవార్త:**

స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఉపముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క, నందిని విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య జన్మదిన వేడుకలు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, పిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జిలు వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి సుబ్బారావు, మారుపల్లి ప్రేమ్ కుమార్, మాజీ సర్పంచ్ సైదా నాయక్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మతోట జనప్రియ కుమార్, సెల్స్ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు,ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా డిప్యూటీ సీఎం తనయుడు సూర్య జన్మదిన వేడుకలు...



**చింతకాని ప్రభాతవార్త ఆగస్టు 29 :**

తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తనయుడు సూర్య విక్రమాదిత్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు శుక్రవారం చింతకాని మండల కేంద్రంలో బాణ సంచాలు కాల్చి,మిఠాయిలు పంచి, కేక్ కట్ చేసి సూర్య విక్రమాదిత్య జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయనకు ఆరోగ్యం, ఆయురారోగ్యాల తో చల్లగా ఉండాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మడిపల్లి భాస్కర్ గౌడ్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కంచుమర్తి రామకృష్ణ ,కూరపాటి కిషోర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కె సేవాదాల అధ్యక్షుడు సతీష్, రవికుమార్ ,పాషా ,మాజీ ఎంపీటీసీలు ఒర్సు వీరభద్రం, బొర్రా ప్రసాదరావు, నాగార్జున, ఆవుల నాగేశ్వరరావు నెల్లూరు కోటేశ్వరరావు, ఆలస్యం బసవయ్య సింగారపు రవి , ఎస్.కె మజీద్ , బి శేషగిరిరావు రామారావు బెల్లంకొండ రామారావు, మడుపల్లి రాంప్రసాద్ , మజిదు, సింగారపు రవి, పాశం సంజీవరెడ్డి, వెంకట్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సూర్య జన్మదిన వేడుకలు

**మధిర ఆగస్టు 29 ప్రభాతవార్త :**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తనయుడు సూర్య విక్రమాదిత్య పుట్టినరోజు వేడుకలు శుక్రవారం మధిర లో మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పోచేపల్లి సురేష్ క్యాంపు ఆఫీస్ ఇంచార్జి ఐలూరి రంగారెడ్డి, జనరల్ సెక్రెటరీలు కందుల పవన్ కళ్యాణ్, వాల్మీకి పవన్,మీనుగు చైతన్య, నాగబాబు, కొంగల సతీష్, భరత్ రెడ్డి, కాంగ్రెస్ యూత్ నాయకులు సాయి, చారి,నిఖిల్,మణికంఠ, ఉదయ్, మనోహర్ యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# బోనకల్ గ్రామపంచాయతీ ఆఫీసులో అఖిలపక్ష సమావేశం



**బోనకల్, ప్రభాతవార్త :**

త్వరలో జరగబోవు గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వార్డులుగా విభజిస్తూ ఓటర్ లిస్టు బోనకల్ గ్రామపంచాయతీ ఆఫీసులో ఉంచడం జరిగింది. ఈ సందర్భంగా బోనకల్ గ్రామపంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి శుక్రవారం గ్రామపంచాయతీ ఆఫీసులో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓటర్ లిస్టులో అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈ నెల 30వ తారీఖు లోపు తెలియజేయాలని, కొత్త ఓట్లు చేర్పించుటకు దరఖాస్తును ఎమ్మార్వో ఆఫీసులో అందజేయాలని సూచించారు. ఈ అఖిలపక్ష సమావేశంలో సిపిఎం పార్టీ నాయకులు తెల్లాకుల శ్రీనివాసరావు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు తేళ్లూరి రమేష్, మోర్ల నరసింహారావు, బిజెపి నాయకులు గుగులోతు నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోటపల్లి స్వామి, యార్లగడ్డ కృష్ణయ్య, టీసీ నాయక్, పాసంగలపాటి కోటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**మధిర ఆగస్టు 29 ప్రభాతవార్త :**



గడిచిన మూడు రోజులుగా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వరద ముంపుకు గురైన పంట పొలాలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకుల బృందం పరిశీలించింది. తొలుత చిలుకూరు గ్రామంలో అకాల వర్షానికి ముంపుకు గురైన పంట పొలాలను మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ బృందం పరిశీలించారు. అదేవిధంగా అధిక వర్షాలు వచ్చినప్పుడు ప్రతిసారి చిలుకూరు గ్రామానికి తీవ్ర నష్టం జరుగుతుంది. అలాగే మండల పరిధిలోని రాయపట్నం మల్లారం రోడ్డు మల్ల వంగవీడు మాటూరు తదితర గ్రామాలలో పంటలను పరిశీలించారు. వర్షాల ప్రభావంతో జరిగిన నష్టాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్తామని సూరంశెట్టి కిషోర్ తెలిపారు. ప్రతి ఏడాది వర్షాల ప్రభావంతో ముంపు గురవుతున్న గ్రామాలలో ముందస్తు రక్షణ చర్యలను చేపట్టే దిశగా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు సూరంశెట్టి కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు, నిడమానూరి వంశీ, చిలువేరు బుచ్చి రాములు అద్దంకి రవికుమార్, గ్రామ కాంగ్రెస్ నాయకులు రైతులు తదితరులు ఉన్నారు.

# కుళ్ళిన గుడ్లతో మధ్యాహ్న భోజనం...

- తినలేక విద్యార్థులు అవస్థలు..
- తల్లిదండ్రుల ముందు మొరపెట్టుకున్న విద్యార్థులు..
- ప్రశ్నించిన తల్లిదండ్రులపై వ్యంగ్యంగా సమాధానాలు..
- ఉపాధ్యాయులపై మండిపడ్డ వైనం...
- మండల అధికారుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ
- విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం..
- ఎంఈఓ ఎదు సింహరాజు








**సారపాక, ఆగస్టు 30, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ తో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యతతో కూడిన తాజా భోజనాన్ని విద్యార్థులకు అందించేందుకు ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ కొందరి నిర్లక్ష్యం వలన అక్కడక్కడ మధ్యాహ్న భోజన పథకం పనితీరు అబాసపాలవుతుంది. అందు నిమిత్తమే బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. దీనిపై ప్రభాత వార్త ప్రత్యేక కథనం.

కుళ్లిపోయిన గుడ్లతో మధ్యాహ్న భోజనం విద్యార్థిని విద్యార్థులకు వడ్డించిన తీరు మండల పరిధిలోని సారపాక ప్రభుత్వ పాఠశాలలో చోటు చేసుకుంది.

సారపాకలోని మండల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధ్వాన్నంగా మధ్యాన్న భోజన పథకం కొనసాగుతుందని విద్యార్థిని తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు. కుళ్ళిన గుడ్లు, పాడైన కూరగాయలుతో నే వంటలు చేస్తూ వాటినే వాడుతున్న సదరు కాంట్రాక్టర్ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ప్రధానోపాధ్యాయులు,సిబ్బంది పర్యవేక్షణ లోపం తేటతెల్లమవుతుందని ఆరేపిస్తున్నారు. అసలే పిల్లలకు ఆట స్థలం లేదని బాధపడుతుంటే ఉన్న ఆ కొద్ది స్థలంలో కూడా టీచర్లు కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కు చేసి స్కూల్ ఆవరణను బురదమయంగా చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు.

అన్నం బాగోలేదని ప్రధానోపాధ్యాయుల మేడం కు కంప్లైంట్ చేసిన పిల్లలపై కక్ష సాధింపుగా కొందరి సిబ్బంది వ్యవహరిస్తున్నరని పలువురు ఆరోపిస్తున్నారు.

సారపాక లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్న భోజనం పథకం పై పలు ఫిర్యాదులు వస్తున్నప్పటికీ పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్న ప్రధానోపాధ్యాయులు , బోధనా సిబ్బంది పై మండిపడుతున్నారు. హై స్కూల్ కు ప్రైమరీ స్కూల్ కు ఒకే దగ్గర భోజనాలు వండి పెట్టడం వలన మధ్యాహ్నం అన్నం తినే సమయంలో చాలా ఇబ్బందిగా ఉందంటూ పిల్లలు తమకి చెప్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాల్సిన బోధన సిబ్బంది పట్టింపు లేకుండా వ్యవహరించడంపై పలువురు మండిపడుతున్నారు. విద్యార్థులు తినే అదే భోజనాన్ని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు కూడా తినాలని ఓవైపు ప్రభుత్వ పెద్దలు ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ, విషయాన్ని పెడచెవిన పెట్టి ఎవరి ఇంటి నుంచి వారు క్యారేజీలు తెచ్చుకొని తింటున్న తీరుపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులకు పెట్టే భోజనంలో నాసిరకపు ముడి సరుకులు వాడటం వలన ఇలాంటి టీచర్లు సైతం అక్కడ భోజనం చేయకుండా ఎవరి క్యారేజీలు వారు తెచ్చుకుంటున్నారని ఆరోపణలు కూడా లేకపోలేదు.

శుక్రవారం జరిగిన సంఘటన మధ్యాన్న సమయంలోరోజు మాదిరిగానే భోజనానికి వెళ్లిన విద్యార్థులకు పాడైపోయిన గుడ్లు, పురుగులు పట్టిన అన్నం పెట్టడంతో ఇదేంటని ప్రశ్నించిన విద్యార్థులకు దురుసుగా సమాధానం చెప్పినట్టు ఆరోపణలు ఉన్నాయి. అసలే హైస్కూల్లో విద్యాబోధన సరిగా లేదని, పిల్లలకు క్రమశిక్షణ నేర్పించడం లేదని, స్కూల్ ఆవరణము పరిశుభ్రంగా ఉండేటట్లు చేయడం లేదని ఎన్నోసార్లు విన్నవించినా తమ మాటలు లెక్క చేయడం లేదని విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సమస్యలకు నిలయంగా మారిన ఉన్నత పాఠశాలపై మండల విద్యాశాఖ అధికారి, జిల్లా శాఖ అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు.

స్కూల్‌కి వచ్చే టీచర్లు కార్లు వేసుకొని వచ్చి వారి వాహనాలతో స్కూలుని ఒక పార్కింగ్ గ్రౌండ్ లా చేసి వాడుకుంటున్నారే తప్ప.. స్కూల్ ఆవరణ బురదమయంగా మారి మురుగు నీళ్లు బయటకు పోక, కాలువలు, మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతూ దోమలు విపరీతంగా పెరుగుతున్న పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు. స్కూల్లో సరైన పిఈటి టీచర్ , వాచ్మెన్ లేక ఉదయం మధ్యాహ్నం సాయంత్రం స్కూలు నుంచి పిల్లలు గేటు బయటకు వచ్చి రద్దీగా ఉన్న రోడ్లపై ఇష్టానుసారంగా తిరుగుతూ చుట్టుపక్కల ఉన్న దుకాణాలలో చిరుతిండ్లు కొనుక్కొని ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటున్నారని వాహనాలు రద్దీగా తిరుగుతుండడంతో ఏదైనా యాక్సిడెంట్ జరిగితే స్కూల్ యాజమాన్యం బాధ్యత వహిస్తుందా అంటూ ప్రశ్నిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు. విషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ఈ ఉన్నత పాఠశాలలో ఉన్న పలు రకాల సమస్యలను పునరుద్ధరించాలని తమ గోడు వెల్లపోసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు.

విషయం తెలుసుకొని ప్రశ్నించడానికి వెళ్లిన కొందరిపై వ్యంగ్యంగా మాట్లాడిన సదరు టీచర్లపై , మధ్యాహ్న భోజన పథక కాంట్రాక్టర్ వంట చేసే వారిపై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

సంఘటన స్థలానికి బూర్గంపాడు తాసిల్దార్ కేర్ కె.వి ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి యదు సింహరాజు చేరుకొని విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడి గొడవను సద్దుమణిగించారు. విద్యార్థుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని వారి ఆరోగ్యం పట్ల మధ్యాహ్న భోజన విషయంలో నాసిరిక కూరగాయలు, కుళ్ళిన గుడ్లు వంటివి వండి పెడితే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. శుక్రవారం జరిగిన సంఘటనపై విచారణ చేపట్టి జిల్లా అధికారులకు నివేదికన అందిస్తామన్నారు. మరొక మారు ఇలాంటి పొరపాటు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు.

# భద్రాద్రి దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన దామోదర్‌రావు



**భద్రాచలం, ప్రభాతవార్త :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో)గా డిప్యూటీ కలెక్టర్ కే.దామోదర్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈవో హోదాలో మొదటి దేవస్థానం దేవస్థానం వద్దకు చేరుకున్న దామోదర్‌రావుకు దేవస్థాన యంత్రాంగం సాంప్రదాయబద్ధంగా ఘనస్వాగతం పలికారు. రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవోగా మొదటి సంతకాన్ని రూ.75లక్షలు అన్నదానం పద్దు కింద ఫిక్స్ డిపాజిట్ నిమిత్తం తొలి సంతకం చేశారు. ఇటీవల వరకు భద్రాచలం ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహించిన దామోదర్‌రావును ప్రభుత్వం దేవాదాయ శాఖకు కేటాయించగా ఆర్డీవోగా రిలీవ్ అయ్యి దేవాదాయ శాఖలో రిపోర్ట్ చేశారు. సూర్యాపేట జిల్లాకు నడిగూడెం మండలం తెల్లబల్లి గ్రామానికి చెందిన ఈయన డిప్యూటీ తహసిల్దార్‌గా, తహసిల్దార్‌గా విధులు నిర్వర్తించి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. 2024న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భద్రాచలం ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. అయితే భద్రాచలం సబ్‌కలెక్టర్‌గా మృణాల్ శ్రేష్ఠను నియమించగా ఆగష్టు 4న దామోదర్‌రావు ఆర్డీవో బాధ్యతలు నుంచి రిలీవ్ అయ్యి దేవాదాయ శాఖలో రిపోర్ట్ చేయగా భద్రాద్రి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా నియమితులయ్యారు. కాగా ఇప్పటి వరకు కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎల్.రమాదేవిని వేములవాడ దేవస్థానంకు బదిలీ అయ్యారు.

# భూములిస్తున్నాం భుక్తి చూపండి

- శాశ్వత ఉద్యోగాలిస్తే తప్ప భూసేకరణకు మద్దతివ్వం
- పెసా గ్రామసభల తీర్మానాలు సొంతంగా రాసుకున్నారు
- ఎస్‌డీసీ సింగరేణికి అనుకూలంగా వ్యవహరించారు
- నిరసనలను అడ్డుకున్నారు
- కోర్టును ఆశ్రయించాం.. న్యాయబద్ధంగా విజయం సాధిస్తాం..
- ఆదివాసీ సింగరేణి ల్యాండ్ లూజర్స్ అసోసియేషన్

పినపాక నియోజకవర్గం, ప్రభాతవార్త, ఆగస్టు 29 ః




పారిశ్రామిక ప్రాంతంగా దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరు ప్రాంతంలో వచ్చిన ప్రతి ప్రాజెక్టు విజయవంతం కోసం మా భూములను త్యాగం చేశాం. ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ గిరిజనులుగా మాకున్న కొద్ధిపాటి భూములను కూడా తృణప్రాయంగా ప్రాంత అభివృద్ధి కోసం కోల్పోయాం. మాపట్ల భూసేకరణ అధికారులు నిర్ధయగా ప్రవర్తిస్తున్నారు. పరిహారం విషయంలో, పునరావాసంలో, ఉపాధి కల్పనలో తమ న్యాయబద్ధమైన కోర్కెలు నెరవేరడంలేదని మణుగూరు మండల ఆదివాసీ సింగరేణి ల్యాండ్ లూజర్స్ అసోసియేషన్ ఆరోపించింది. శుక్రవారం మణుగూరు గిరిజన భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మణుగూరుఓసీ విస్తరణ మూలంగా భూములు కోల్పోతున్న తిర్లాపురం, విజయనగరం, కొండాపురం ప్రాంతాలకు చెందిన గిరిజన భూనిర్వాసితులు భూసేకరణ సందర్భంగా భూసేకరణ అధికారులు, సింగరేణి సంస్థ అనేక తప్పుడు నివేధికలు తయారుచేస్తూ తమ భూములను బలవంతంగా గుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, జరుగుతున్న పరిణామాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 813ఎకరాల భూసేకరణలో సుమారు 150మంది గిరిజన రైతులు తమ భూములు కోల్పోతున్నారన్నారు. వీరితో పాటుగా అనేకమంది గిరిజనేతరులు కూడా ఈ భూసేకరణలో తమ భూములను కోల్పోయి నిర్వాసితులు కాబోతున్నారు. ఈ క్రమంలో పెసా గ్రామసభల తీరును నిరసిస్తూ గిరిజన నిర్వాసితుల న్యాయబద్ధమైన, చట్టబద్ధమైన కోర్కెల సాధన కోసం తాము 73మంది గిరిజనులం కోర్టును ఆశ్రయించామని విలేకరులకు తెలిపారు. ప్రధానంగా పెసా గ్రామసభ తీరుపైనే తాము కోర్టుకెక్కగా తాము సమర్పించిన అఫిడవిట్‌కు స్పందించిన ఎస్‌డీసీ పెసాను పరిగణలోకి తీసుకోకుండా సొంతంగా తీసుకున్న నిర్ణయాలను కోర్టుకు సమర్పించడం ఆశ్చర్యం కల్గించిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో భూసేకరణ జరగాలంటే ఖచ్చితంగా అమలుచేసి తీరాల్సిన పెసా గ్రామసభలను అపహాస్యం చేస్తూ భూసేకరణ అధికారిగా వ్యవహరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్రామసభల్లో జరుగుతున్న సంతకాల సేకరణ, నిర్వాసితుల అభిప్రాయాలకు భిన్నంగా కలెక్టర్, ఐటీడీఏ పీవోలను తప్పుదోవ పట్టిస్తూ తీర్మాణ ప్రతులను విడుదల చేస్తున్నారని నిర్వాసితులు ఆరోపించారు. పెసా గ్రామసభ తీర్మాణాలు పంచాయతీ కార్యదర్శుల నుంచి తాము సమాచారహక్కు చట్టం ద్వారా సేకరించిన కాగితాలకు ఎస్‌డీసీ కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌కు ఏమాత్రం పొంతన లేదని, తప్పుడు పత్రాలు సమర్పించి న్యాయవ్యవస్థను, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిన ఎస్‌డీసీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ప్రధానంగా బీటీపీఎస్ భూసేకరణ సందర్భంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగ కల్పన చేసినట్లుగానే తమకు కూడా శాశ్వత ఉపాధి ఇచ్చే విధంగా ఉద్యోగాలివ్వాలని నిర్వాసితులు కోరారు. ఔట్‌సోర్సింగ్ పేరిట ఉద్యోగాలిస్తామంటున్న సింగరేణి కోలిండియాలో జరుగుతున్న కనీసవేతన ఒప్పందాలను ఉల్లంఘిస్తూ కాంట్రాక్టు కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలను కోలిండియాతో సమానంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే మణుగూరు ప్రాంతంలో బీటీపీఎస్, సింగరేణి, సింగరేణి రైల్వేలైన్, సీతమ్మసాగర్ కరకట్ట నిర్మాణం కోసం వేలాది ఎకరాల భూములను తాము కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాంత అభివృద్ధి కోసం భూములివ్వడానికి తాము ఎప్పుడూ సిద్ధమేనని, న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా తమకు పరిహారం చెల్లించి భూములు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సమావేశంలో నిర్వాసితుల తరుపున కోడి నాగరాజు, సోడే రవికుమార్, కుంజా ఆనంద్, కుంజా వెంకటేశ్వర్లు, కారం నర్సింహారావు, శరం గణేష్, ఎలిబోయిన సతీష్, కుంజా నాగశర్మ, సోయం నాగేశ్వరరావు, తిర్లాపురం, విజయనగరం గిరిజన మహిళలు, రైతులు పాల్గొన్నారు.

# ఆల్వేస్ పోలీస్ అలర్ట్..!

## - కమిషనరేట్‌లో ఖాకీల నిరంతర తనిఖీలు
## - సిటీ పోలీస్ యాక్ట్ అమలుతో నేరాల నియంత్రణ
## - వరదలు ప్రకృతి విపత్తులలో ప్రజలకు రక్షకభటుల విశేష సేవలు
## - గణేష్ మండపాల పర్యవేక్షణ, అప్రమత్తంగా వ్యవహరించేలా సూచనలు
## - ప్రశాంత నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు
## - ప్రభాతవార్త క్రైమ్ ప్రతినిధి శ్యామ్ నల్లితో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ప్రభాత వార్త క్రైమ్ ప్రతినిధి:

శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసులు ఎంత ప్రాధాన్యత ఇస్తారో.. అసమాన్య ఘటనలు చోటు చేసుకున్నప్పుడు..వరదలు ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు ప్రజలకు రక్షణగా నిలుస్తున్నారు ఖమ్మం కమిషనరేట్ పోలీసులు. ఆల్వేస్ పోలీస్ అలర్ట్ అంటూ.. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ.. తనదైన శైలిలో ముందుకు దూసుకు వెళుతున్నారు ఖమ్మం పోలీస్ కమిషనర్, సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ దత్. ఇవిటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గ్యాలంటరీ అవార్డు పొందిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసిన ప్రభాతవార్త క్రైమ్ ప్రతినిధితో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రత్యేకంగా మాట్లాడారు.. గతం లో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఎంతో ధైర్యసాహసాలతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం తో కేంద్ర ప్రభుత్వం గ్యాలంటరీ మెడల్ 2024 కు ఎంపిక చేసింది. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ గోల్కొండ కోట లో ఏర్పాటు చేసిన వేడుకలలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా గ్యాలంటరీ మెడల్ ను అందుకున్నారు పోలీస్ కమిషనర్ సునీల్ దత్.

### - నిఘా నీడలో నిరంతర పర్యవేక్షణ

ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో శాంతిభద్రతల పర్యవేక్షణకు పెద్ద పీట వేయడమే కాకుండా.. నేరాల నియంత్రణ.. అక్రమాల అడ్డుకట్టకు నిరంతర తనిఖీలు జరుపుతున్నామన్నారు. ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ.. పలు సూచనలు సలహాలు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలోకి వచ్చి వెళ్లే అన్ని వాహనాలను నిరంతరంగా ఆయా పోలీస్ స్టేషన్లో పరిధిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడమే కుండా.. అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని చెప్పారు. చోరీల నియంత్రణకు, నేరాల అడ్డుకట్టకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామని ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా పోలీసులు తమ విధులు నిర్వహిస్తుంటారని పేర్కొన్నారు.

### - మాదక ద్రవ్యాల నియంత్రణకు అడ్డుకట్ట:

మాదక ద్రవ్యాల నియంత్రణకు అడ్డుకట్ట వేసే దిశగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా మీదుగా గంజాయి అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఆకస్మిక తనిఖీలు చేపడుతూ మంచి ఫలితాలను రాబట్టామన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా భారీగా గంజాయి రవాణా చేసే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువత గంజాయి మత్తుకు బానిసలు అవుతుండటంతో వారి తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తూ పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే పోలీసులు దృష్టికి తీసుకురావాలని తద్వారా ఉన్నతాధికారుల ఆదేశాలతో కౌన్సిలింగ్ ప్రక్రియను కూడా నిర్వహిస్తామని చెప్పారు.

### - సిటీ పోలీస్ యాక్టు అమలుకు ప్రాధాన్యం:

గతంలో అర్ధరాత్రి దాటినా తెరిచి ఉండే షాపులు.. అర్ధరాత్రులు ద్విచక్ర వాహనాలపై ఇద్దరు ముగ్గురు పని ఉన్నా.. లేకపోయినా రోడ్లపై తిరుగుతుండటం.. తెల్లవార్లు దాబాలు, బెల్టు షాపుల్లో అక్రమ మద్యం అమ్మకాలు సాగడం, బహిరంగ మద్యం సేవిస్తూ ఇతరులకు ఇబ్బందులు కలుగజేయడం, ర్యాష్ డ్రైవింగ్, న్యూసెన్స్ సాగిస్తూ పలు ఆకతాయిలు, అల్లరిమూకలు అర్ధరాత్రులు దాటినా రోడ్లపై బర్త్ డేల పేర్లతో వాహనాలు నిలిపి గలాటాలు సృష్టించడంపై ఉక్కు పాదం మోపారు . సీపీ సునీల్ దత్. పోలీస్ కమిషనరేట్లో సిటీ పోలీస్ యాక్టుకు ప్రాధాన్యత కల్పించడంతో రాత్రి 10.30 గంటల కల్లా షాపులు మూసివేయడంతో రోడ్లపై అనవసర జన సంచారం చాలా వరకు తగ్గింది. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, ర్యాష్ డ్రైవింగ్, న్యూసెన్సులు సృష్టించే ఆకతాయిలపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. సిటీ పోలీస్ యాక్ట అమలు చేయడంలో ప్రాధాన్యతను సిబ్బందికి వివరిస్తూ నమోదైన పలు కేసుల్లో సెక్షన్ల ప్రాధాన్యతను కూడా అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పిస్తూ దగ్గరుండి మరీ కేసులను పర్యవేక్షిస్తున్నామన్నారు.

### - అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదనే సంకేతం

జిల్లా పోలీస్ శాఖలో గత కొంత కాలంగా పేరుకుపోయిన నిర్లక్ష్యపు జాడ్యానికి చెక్ పెట్టేలా వ్యవహరిస్తున్నారు పోలీస్ కమిషనర్ సునీల్ దత్. కమిషనరేట్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించినా, అక్రమాలకు పాల్పడినా వేటు తప్పదనే సంకేతాలు ఇస్తున్నారు. ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బంది. అధికారుల పనితీరును నిశితంగా పరిశీల్నిచి నివేదికల ఆధారంగా చర్యలు చేపట్టారు. విజిబుల్ పోలీ సింగ్ కు పెద్ద పీట వేస్తూ నిరంతరం తనిఖీలతో సిబ్బందిని అప్రమత్తం చేస్తూ.. ఖమ్మం పోలీస్ కమిషనరేట్లో సునీల్ దత్ మార్క్ కనబరుస్తున్నారు.

– భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

జలమయం అయిన రోడ్లు, వంతెనలు,వాగులు దాటే ప్రయత్నం చేయవద్దు.జిల్లాలో గత కొన్ని రోజు లు గా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రజలకు తెలియజేశారు. జిల్లాలో రెండు రోజులు గా కురిసిన వర్షాలకు వాగులు ఉధృతంగాప్రవహిస్తుండటంతో నీట మునిగిన రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని అన్నారు. ఎవరు కూడా చేపల వేటకు వెళ్లవద్దని, పశువుల కాపర్లు చెరువులు, వాగులు దాటవద్దని, యువకులు సెల్ఫీల కోసం నీటి ప్రవాహం వద్దకు వెళ్లవద్దని సూచించారు. పిల్లలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇప్పటికే చెరువులు, వాగుల వద్ద పోలీస్ పెట్రోలింగ్ పెంచి ప్రమాద హెచ్చరికలను తెలియజేసేలా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చెరువులు, కుంటల వద్ద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని వంతెనలు, చప్టలపై బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాల భారీన పడకుండా వాహనాల రాకపోకలను నిషేధించాలని పోలీస్ అధికారులకు ఆదేశించమని తెలిపారు. అదేవిదంగా ఎగువ ప్రాంతంలో అధిక వర్షాల మూలంగా మున్నేరు వరద ఉధృతి పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రజలు కూడా అపప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### - గణేష్ మండపాల నిరంతర పోలీస్ పహారా

వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని శాంతి సామరస్యాన్ని కాపాడుకుంటూ భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోలా నవరాత్రుల ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో జరుపుకొనే అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను గతంలో లాగానే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా జరుపు కొనేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. . ముఖ్యంగా మండపాల్లో డీజే ఏర్పాటుకు అనుమతి లేదని, నిబంధనలను మండపం నిర్వాహకులు, కమిటీలు పాటించాలని సూచించారు. గణేష్ మండపంలో 24 గంటల పాటు విధిగా వాలంటీర్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని అంతే కాకుండా భక్తుల సందర్శనను దృష్టిలో ఉంచుకుని మండపాలలో క్యూలైన్లను ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించామన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు, కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయించామని. గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### - నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు..

వినాయక నిమజ్జనోత్సవానికి జిల్లా పరిధిలో ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. గణేష్ నిమజ్జనం కోసం భారీ పోలీసు బందోబస్తుతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు గజ ఈతగాళ్లను, నిమజ్జనానికి వినియోగించే క్రేన్స్, లైటింగ్స్, సీసీ టీవీ కెమెరాలు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా చెరువులు, ఇతర నిమజ్జన నీటి కుంటల వద్ద వీధి దీపాలు, ఫ్లడ్ లైట్లు, అవసరమున్న మేర క్రేన్లను ఏర్పాటు చేయనున్నట్లు పెర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం గణేశ్ నిమజ్జనం జరిగే చెరువు కట్టల వద్ద విద్యుత్ లైట్లను, బారికేడ్లు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ కమిషనరేట్ లో ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లి విజయవంతం చేస్తామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.




# అగ్రహారంపాత రైల్వే గేట్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న అన్నదాన కార్యక్రమం



ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త:

ఖమ్మం నగరంలోని 16 డివిజన్ అగ్రహారం పాత రైల్వే గేట్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బండారు నరసయ్య, బసవమ్మ లు తెలిపారు. శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నిత్య పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు బండారు ఏడుకొండలు, జ్యోతి, బండారు రామకృష్ణ, రేణుక, బండారు భాస్కర్, వీర కుమారి నల్లి శారద, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల యుగంధర్ కలిసిన 25వ డివిజన్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు

ఖమ్మం కార్పోరేషన్ ఆగస్టు 29 ప్రభాతవార్త:



కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహారావు ఖమ్మం నగరంలోని 25వ డివిజన్ నందు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరు చేసినప్పటికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థలము తక్కువగా ఉందని ప్రభుత్వ అధికారులు అభ్యంతరం తెలుపుతున్నందున వారికి అనుమతులు ఇవ్వాలని మాజీ కార్పొరేటర్ నరసింహారావు మంత్రి తనయుడు తుమ్మల యుగంధర్ కు వినతి పత్రం సమర్పించారు .అట్టి స్థలములో జి ప్లస్ వన్ ఇల్లు నిర్మించుకొనుటకు గానీ, లేదా నిర్మించుకున్న ఇంటికి చదరపు గజాల చొప్పున లెక్కల ప్రకారం ఎంత ఇవ్వగలరు అంత చెల్లించినట్లు, కొంతమంది లబ్ధిదారులు పిల్లర్లు వేసుకొని బేస్మెంట్ కట్టుకొని ఉన్న లబ్ధిదారులకు కూడా వెసులుబాటు కల్పించాలని, వడ్డెబోయిన సారథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తుమ్మల గారి తనయుడు యువ నాయకుడు తుమ్మల యుగంధర్ గారిని కలిసి విన్నవించటం జరిగింది.ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల కింద మంజూరైన కొంతమందికి స్థలం తక్కువగా ఉన్నందున ఇల్లు నిర్మించుకొనుటకు గాను ప్రభుత్వం ద్వారా జిల్లా మంత్రులు కృషిచేసి అనుమతి ఇచ్చే విధంగా కృషి చేయవలసిందిగా కోరడమైనది.... ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష ,కార్యదర్శులు. దాసరి .పూర్ణ ,నాగిశెట్టి. రాధాకృష్ణ ,గార్ల .వెంకన్న, గార్ల. వీరస్వామి. మహిళలు శ్రీరీ. ఫర్జానా, శ్రీరీ. హాలీమా, నూర్జహాన్, చింతల. వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం

**పినపాక ప్రభాతవార్త:**

గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని మండల వ్యాప్తంగా గణేష్ మండపాలలో మహాఅన్నదాన కార్యక్రమాలను కమిటీ నిర్వాహకులు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్ లోని వర్తక సంఘం అధ్యక్షులు గుండు సురేష్,కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద శుక్రవారం ఆకుల సత్యనారాయణ రత్నకుమారి దంపతులు సహకారంతో మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.మహా అన్నదాన కార్యక్రమానికి 2000 మంది పైచిలుకు భక్తులు హాజరై అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో క్రాస్ రోడ్ వర్తక సంఘం అధ్యక్షులు గుండు సురేష్,వర్తక సంఘం గౌరవ అధ్యక్షులు మార్తా



నరసింహారావు, లక్ష్మణాచారి, వెన్న భాస్కర్ రెడ్డి, ఏగ్గాడి శ్రీరామ్, వెంకటేశ్వరరెడ్డి, కమలాకర్, వేణుగోపాలచారి, మోరం వేణు, చరణ్, వేలాడండి లక్ష్మణ్, గీద సాయి, మోహన్, రాంబాబు, మురళి, రవీందర్ రెడ్డి, గోపిరెడ్డి, ఎస్ఆర్ రెడ్డి, శ్రీను సాంబయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.




## గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 29 :**

మణుగూరు మండల పరిధిలోని కొండాయిగూడెం పుష్కరఘాట్ వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక నవరాత్రులను పురస్కరించుకొని మండలంలో వివిధ గణేష్ మండపాల వద్ద ఏర్పాటుచేసిన గణనాధులను శనివారం నుంచి నిమజ్జనం చేయనుండడంతో కొండాయిగూడెం గోదావరి పుష్కరఘాట్ నిమజ్జనానికి అనుకూలంగా భావించిన అధికారులు అందుకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ఘాట్లను పరిశీలించారు. శుక్రవారం మణుగూరు తహశీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, సీఐ పాటి నాగబాబు, సింగరేణి ఎస్అండ్‌పీసీ అధికారి శ్రీనివాస్‌ల బృందం ఘాట్లు పరిశీలించిన అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం



ఏర్పాటుచేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధంచేసినట్లు తెలిపారు. వీరితో పాటు ఎస్సై రంజిత్, ఎంపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ సంబరాలు

**పినపాక, ప్రభాతవార్త, ఆగస్టు 29:**



మండల పరిధిలోని జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ క్రీడా మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ పుట్టినరోజును పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.వేడుకల్లో విద్యార్థులు చేసిన అభినయాలు అలరించాయి. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు భారతదేశానికి మొట్టమొదటిసారిగా ఒలంపిక్స్ క్రీడారంగంలో పథకాలు సాధించిన క్రీడాకారుడు ధ్యాన చంద్ గురించి వివరించారు.హాకీ క్రీడలో మూడుసార్లు స్వర్ణ పథకాన్ని సాధించి పెట్టిన మొట్టమొదటి భారతీయ క్రీడాకారుడని,అతని పుట్టినరోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నారని విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 29 :**

శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని మణుగూరు మండల పరిధిలోని రామానుజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన పాఠశాల ఉపాధ్యాయులు ధ్యాన్‌చంద్ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో




పోలెబోయిన అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నదానం

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 29 :**

వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మణుగూరు ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం ఘనంగా అన్నదానం నిర్వహించారు. గత 8సంవత్సరాలుగా గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అన్నదానానికి మణుగూరు సీఐ పాటి నాగబాబును ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఐ నాగబాబు, ఎస్సై రంజిత్‌లు అసోసియేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. తమ అన్నదాన



కార్యక్రమానికి సహకరించిన అందరికీ ఉత్సవకమిటీ సభ్యులు వి.కృష్ణమోహన్, పి.శ్రీనివాస్, శ్రీనివాస్, వెంకట్, ఆనంద్, శ్రీహరి, సురేష్, సాగర్, తులసీరాం, కృష్ణలు కృతజ్ఞతలు తెలిపారు.

## కొలువైన గణనాధులు

**- మూడో రోజు పూజలతో గణేశ్ నవరాత్రులు**

**- విఘ్నేశ్వర నామ స్మరణతో మారుమ్రోగుతున్న గ్రామాలు**

**కరకగూడెం,ప్రభాతవార్త:**



దండాలయా ఉండ్రాలయ్యా,మీ అండా దండా ఉండాలయ్యా దయుంచయ్యా దేవా అంటూ మండల వ్యాప్తంగా గణపతి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో విఘ్నేశ్వరుని నామ స్మరణతో భక్తుల్లో భక్తిభావం ఉప్పొంగింది. మండల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో,దేవాలయ ప్రాంగణాల్లో ఆయా గ్రామాల్లోని ఉత్సవ కమిటీ లు గణేష్ మండపాలు వివిధ రూపాలలో వున్న విఘ్నేశ్వర స్వామి విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారు.పది రోజుల పాటు గణనాథ స్మరణతో, ఆధ్యాత్మిక సందడితో పులకించిపోనున్నాయి. ప్రతీ వీధిలోనూ విఘ్నేశ్వరుడు కొలువు దీరాడు.వినాయక చవితి పండగ మండల వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకో నున్నారు. వీధి వీధి, వాడ వాడలా మండపాలు ఏర్పాటు చేసి గణనాథునికి మూడో రోజు పూజలు నిర్వహించారు. వివిధ రూపాల్లో కొలువు దీరిన వినాయకులను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.నవరాత్రుల వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తుండటంతో మండపాలన్నీ ఆధ్యాత్మిక శోభతో అలరాలుతున్నాయి. రంగురంగుల విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించిన గణేష్ మండపాలలో కొలువైన గణనాధుడు విశేష పూజలందుకుంటున్నాడు.



## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రమాదభీమా కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలి

**- ఐఎఫ్‌టీయూ**

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు29 :**

ప్రమాదసంఘటనలలో మృతిచెందిన కాంట్రాక్టు కార్మిక కుటుంబాలకు హెచ్‌డీఎఫ్‌సీ అమలుచేస్తున్న ప్రమాదభీమా సౌకర్యాన్ని వర్తింపజేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని గోదావరిలోయా బొగ్గుగని కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌డీ.నాసర్‌పాషా శుక్రవారం కోరారు. ఇందులో భాగంగా ఏరియా పర్సనల్ అధికారులు సింగు



శ్రీనివాసరావు, తిరుపతిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగోత్ మంగీలాల్, ఎం.మాధవ, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## డీవైసీఎంవో జ్యోతీర్మయికి సన్మానం

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 29 :**

సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆస్పత్రిలో జనరల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న డీవైసీఎంవో జ్యోతీర్మయి పదోన్నతి పొందిన సందర్భంగా ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచి కమిటీ శుక్రవారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బ్రాంచి సెక్రెటరీ వై.రాంగోపాల్ మాట్లాడుతూ.. అంకితభావం, నైపుణ్యంగల వైద్యురాలుగా ఏరియా కార్మికుల హృదయాల్లో స్థానాన్ని సంపాదించుకున్న జ్యోతీర్మయి ఇదేస్ఫూర్తితో మరిన్ని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎం.రామనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచి సెక్రెటరీ మేకల ఈశ్వర్, నాయకులు



పుల్లారావు, గోలి గంగాధర్, ఆవుల నాగరాజు, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సందీప్, పద్మావతి, కుమారస్వామి, ఈసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాత ఇల్లందులపాడులో వినాయక నవరాత్రి మహోత్సవాలు

ఇల్లందు అర్బన్, ఆగస్టు 29 ప్రభాతవార్త :





పట్టణంలోని రెండవ వార్డు పాత ఇల్లందులపాడు గాంధీ బొమ్మ సెంటర్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద శుక్రవారం స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గత కొన్ని ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపం వద్ద స్థానికులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తుంటారు. తొమ్మిది రోజుల్లో తొమ్మిది రకాల ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది. ఇది ఇలా ఉండగా నేడు భక్తులకు ఈ గణేష్ మండపం వద్ద మహా అన్నదాన ప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గణేష్ మహారాజ్ ఆశీస్సులు పొందుతూ తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని భక్తులను కోరారు.

## విభిన్నవర్గాల మధ్య ఐక్యతకు గణేష్ ఉత్సవాలు దోహదం

**- అన్నదానం మహున్నతమైన సత్కార్యం**

**- పారిశుధ్యానికి ఉత్సవ కమిటీలు ప్రాధాన్యత ఇవ్వాలి**

**- సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 29 - ప్రభాతవార్త:



స్నేహభావం, సమాజసేవ కలగలిపిన ఉత్సవాల ద్వారా ప్రజల మధ్య ఐకమత్యం పెరుగుతుందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని 30వ వార్డు దుర్గన్ బస్తీలో గణేష్ నవరాత్రుల సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన, అన్నప్రసాద కార్యక్రమాన్ని శుక్రవారం అయన ప్రారంభించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ గణేష్ నవరాత్రులు ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తాయని, సమాజంలో బలహీన వర్గాల ప్రజలకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చాలా అవసరమని, అన్నదానం అనేది అత్యున్నతమైన దానం, ఇది కేవలం భక్తి కార్యక్రమమే కాకుండా పేదవర్గాల తోడ్పాటు అందించే సత్కార్యం అని సాబీర్ పాషా పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు కేవలం పండుగలకు పరిమితం కాకుండా సామాజిక సేవకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, మాజీ కౌన్సిలర్లు నేరెళ్ల సమైక్య, యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాయణాచారి, సిపిఐ పట్టణ నాయకులు నేరెళ్ల శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలకు నిలయం కొత్త లంకపల్లి గ్రామపంచాయతీ సిపిఎం సర్వేలో వెల్లడి

**- తక్షణమే పరిష్కారం చేయండి**

**- సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్ రావు**

పెనుబల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త:



మండలపరిధిలోని కొత్త లంక పల్లి గ్రామపంచాయతీలోని ప్రజలు అనేక సమస్యలతో అల్లాడిపోతున్నట్లు సిపిఎం సర్వేలో వెల్లడైనట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమల విఠల్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన గిరిజనుల నివాసం కొత్తలంక పల్లి గ్రామంలో పర్యటించి పలు సమస్యలు తెలుసుకున్నారు. ఈ ప్రాంతానికి మంచినీళ్ల ట్యాంక్ ద్వారా రాకుండా ఇబ్బందులకు గురవుతుంది. చెత్త చెదారం రోడ్డు పక్కన వేయడం వలన చెడు దుర్వాసనతో ప్రజలు జబ్బుల బారీన పడుతున్నారు. గిరిజన పిల్లలు చదువుకుంటున్న పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. సుందరయ్య కాలనీ మురికి నీటితో నిండిపోయింది. దీని వలన అనేక అంటూ వ్యాధులు సంభవిస్తున్నాయని ఈ సమస్యలు పరిష్కారం చేయాలని, గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సిపిఎం నాయకత్వాన ధర్నా నిర్వహించి, గ్రామపంచాయతీ కార్యదర్శి కి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లాకమిటీ సభ్యుడు చలమాల విఠల్ రావు మాట్లాడుతూ కొత్తలంక పల్లి గ్రామపంచాయతీ పరిధిలో సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని, అధికారులు వెంటనే స్పందించాలని ఆయన కోరారు. సిపిఎం మండల కార్యదర్శి తిరుపతిరావు పాల్గొని మాట్లాడుతూ మంచినీటి సమస్య, మురుగునీటి సమస్య, చెత్తాచెదారం సమస్యలను పరిష్కారం చేయటంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారని, అధికారులు తక్షణమే పరిష్కారానికి పూనుకోవాలని, గత ఐదు సంవత్సరాల నుంచి వాటర్ ట్యాంక్ పనిచేయకపోతే అధికారులు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు తడికమళ్ళ చిరంజీవి, పోతిని కొరయ్య, పోతన బుచ్చాలు, చిలక రమణ, కాలసాని శ్రీనివాసరావు. గుడిమెట్ల బాబు, పోతిని సత్యనారాయణ. గొల్లమందల సరస్వతి, షేక్ సర్దార్, వట్టిగ బజార్, పి. లక్ష్మయ్య, రేసు పద్మ, చితకా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## త్వైకండో లో మెడల్స్ సాధించిన విద్యార్థులు

**- త్వైకండో కోచ్,మాస్టర్స్ షమీఉద్దిన్, రమేష్**

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 29 - ప్రభాతవార్త:



మేజర్ ద్యానచంద్ జయంతి సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా తైక్వాండో క్రీడా పోటీల్లో కొత్తగూడెం తైక్వాండో క్రీడాకారులు అండర్ 9 గర్ల్స్ లో హఫ్సా ఫాతిమా బంగారు,పి.అధితి ప్రియ రజత,డి.భవంతి కాంస్య,అండర్ 10 లో కె.సహస్ర బంగారు,ఎల్ నాగ జేశ్విత రజత,పుండరీకాక్ష కాంస్య,అండర్ 11 జి.మన్విత బంగారు,జె ప్రశాంతి రజత,ఎస్.కె సైమా కాంస్య పతకాలు సాధించారు. పథకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మెడల్స్ ప్రధానం చేసి క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్తులో ఇంకా సాధన చేసి రాష్ట్ర,జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించి జిల్లాకు పేరు,ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించినట్లు తైక్వాండో కోచ్ లు ఎం.డీ.షమీఉద్దిన్,రమేష్ లు తెలిపారు. ఈకార్యక్రమంలో జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్,బాక్సింగ్ జిల్లా చీఫ్ ప్యాట్రన్ యెర్రా కామేష్,యాకూబ్ మాస్టర్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లెందు వార్త

### ఇల్లెందు, గుండాల, టేకులపల్లి

## హైదరాబాదులో జరిగే కాంట్రాక్టు కార్మికుల సదస్సును జయప్రదం చేయండి

ఇల్లందు అర్బన్, ఆగస్టు 29, ప్రభాతవార్త :



కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్, స్కీం కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం నెలకు26వేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 7న హైదరాబాదులో జరిగే ఐ ఎఫ్ టి యు సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్టియు జాతీయ ఉపాధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇల్లెందు ఐఎఫ్టియు కార్యాలయంలో సదస్సు ప్రచార పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ, ఉపాధి భద్రత,పని స్థలాల్లో రక్షణ,సమానపనికి సమాన వేతనం,8గంటల పని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులతో పాటు ఆశ,అంగన్వాడి మిడ్ డే మీల్స్, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ కార్మికులతో ప్రభుత్వాలు వెట్టి చాకిరి చేయిస్తూ శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని ఆయన విమర్శించరు. ఈ సమస్యల పరిష్కారానికై సెప్టెంబర్ 7న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు సదస్సుకు వివిధ రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కొక్కుసారంగపాణి,జె. సీతారామయ్య,జిల్లా సహాయకార్యదర్శి ఎండి. రాసుద్దీన్,జిల్లా ఉపాధ్యక్షులు డి.ప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్,ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి ఉపేందర్ రావు,డి.మోహన్ రావు నాయకులు సింగారపు శ్రీను,టియుయం చారి,పల్లి సుధాకర్,డి. నూనెశ్వరరావు,ఏ. మహేందర్,మురళి తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందించిన సతీష్ ఖండేల్వాల్..

ఇల్లందు టౌన్, ఆగస్ట్ 29, ప్రభాతవార్త:



జాతీయ క్రీడ దినోత్సవ వేడుకల సందర్భంగా గాయత్రి పరివార్ నిర్మాన్ మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మాస్టర్ మైండ్స్ ఉన్నత పాఠశాలలో క్యారమ్స్, చెస్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు రుత్విక్, డేవిడ్, కౌశిక్, నిశాంత్, ఆశాశ్రీ, లోహిత్ లకు గాయత్రి పరివార్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ బహుమతులతో పాటు పండిత శ్రీరామ శర్మ రచించిన పుస్తకాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలనుండి వృద్ధుల వరకు నిత్యం గంట పాటు మైదానంలో గడపాలని సూచించారు. అనంతరం నేషనల్ స్పోర్ట్స్ డే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సర్వేశ్వరరావు, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, నరసయ్య పాల్గొన్నారు.



## మందలపల్లి బస్టాండ్‌ను పరిశీలించిన సిపిఎం నాయకులు

**దమ్మపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త:**

భారీ వర్షాలతో అద్వానంగా తయారైన మండల పరిధిలోని మందలపల్లి ఆర్‌టిసిబస్టాండ్‌ను మండల సిపిఎం నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగామండల కార్యదర్శి మోరంపూడి



శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతీయ రహదారికిఅనుకొని ఉన్న ఈ బస్టాండ్ వచ్చే ప్రయాణికులు లోపలికి రావాలన్న బయటకువెళ్ళాలన్న కప్ప గెంతులతో బురద అంట్టించుకొని ప్రయాణం చేస్తూ అసహనంవ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రజలను ఉద్దరిస్తామని వాగ్దానాలు ఇచ్చేపాలకులు కనీసం ఈ బస్టాండ్‌కు సిసి రోడ్డు ఏర్పాటు చేయాలనే సోయి లేకపోవడందురదృష్ట కరమని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు బస్సుల్లో ప్రయాణిస్తే ఈబాధలు తెలుస్తాయని అంతే కానీ ఖర్చీదెన కారల్లో తిరిగితే తెలవదని అన్నారు.ఒక మంత్రి, ఒక ఎమ్మెల్యే ఉన్న ఈ మండల బస్టాండ్ కు సిసి రోడ్డు ఎర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాద్యక్షుడుపిట్టల అర్జున్‌రావు, మురహరి రఘు, ప్రశాంత్, సంతోష్ తదితరులుపాల్గొన్నారు.

## బిసి నాయకుల ప్రత్యేక సమావేశం

**దమ్మపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని మందలపల్లి పంచాయతీ ప్రకాష్‌నగర్ కాలనీలో బిసి



నాయకుల,కార్యకర్తల ప్రత్యేక సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమాశంలో రాజకీయాలకుఅతీతంగా మనమందరం కలిసి పనిచేయాలని బిసి నాయకులు తీర్మానించుకున్నారు.ఇందులో భాగంగా ఈనెల 31 ఆది వారం రోజున అవీవ్‌నర్సరీలో బిసి సంఘ సమావేశంమద్యాహ్నం 2గంట లకు జరుగుతుందని కావున మండలంలోని బిసి నాయకులు,కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని బిసి నాయకులు కోరారు.

## వినాయకపురంలో ఓటరు జాబితా ప్రచురణ

**అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 29 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వినాకపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీఓటరు జాబితాను ప్రకటించారు. త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికలనేపధ్యంలో వినాయకపురం పంచాయతీలో 12 వార్డుల వారీగా రూపొందించినఓటరుజాబితాను పంచాయతీ సెక్రటరీ నోటీస్ బోర్డులో ప్రజలకు అందుబాటులోఉంచారు. 30వ తేదీ సాయంత్రం లోపు పంచాయతీలోని ఓటర్లు ఆఫీస్‌కు వచ్చినోటీస్‌బోర్డులో మీకు సంబంధించిన ఓట్ల వివరాలను సరి చూసుకోవాలని, ఏమైనాఅభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలిపితే వాటిని సరిచేయడం జరుగుతుందనితెలిపారు. కావున వినాయకపురం పంచాయతీ ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.




## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు**

**తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం,**

**సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**కూసుమంచి, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

పేదల సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండలంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించి, పీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూస్, రెండు జతల సాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గతంలో ఉన్న బీటీ రోడ్డు గత సంవత్సరం వచ్చిన వరదలో కొట్టుకొని పోయిందని, కోటి 22 లక్షలతో పాలేరు పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి హట్యాతండా వరకు బీటీ రోడ్డు మరమ్మతుల పునరుద్ధరణకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. గతంలో వరదలకు దెబ్బతిన్న కాలువలు, రోడ్ల మరమ్మతు పనులు, అంతర్గత సీసీ రోడ్డు, పశు వైద్యశాల, తాగునీటి సరఫరా పనులు, లింక్ కెనాల్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. టెండర్ ప్రక్రియ త్వరగా ముగించి అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. మల్లాయిగూడెం నుంచి భగత్ వీడు వరకు రూ.3కోట్ల 30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని, గతంలో రూ.45 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించామని, తాగునీటి సమస్యలు పరిష్కరించామని తెలిపారు. లింగారంతండాలో రూ. 20 లక్షల రూపాయలతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత లింగారాంతండా, గన్యా తండా వేరు వేరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ భవనానికి ప్రహరీ గోడ, అంగన్వాడీ భవనం త్వరలో మంజూరు చేస్తామని అన్నారు. జీళ్ల చెరువు గ్రామంలో రూ.2 కోట్ల 25 లక్షలతో నిర్మించనున్న ఆర్ అండ్ బీ రోడ్డు నుండి శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ వరకు ఉన్న ఘాట్ రోడ్డు, రూ.20 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. జీళ్ళ చెరువు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం డబుల్ లైన్ రోడ్డు, సైడ్ డ్రైయిన్లతో అద్భుతంగా తీర్చిదిద్దే దిశగా డిజైన్ చేశామని, ఈ రోడ్డు త్వరగా పూర్తి చేసి ఆలయానికి వచ్చే భక్తులకు ఉపయోగంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన తర్వాత ప్రజల దీవెనలతో పేదల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500రూపాయల గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, 7 లక్షల రేషన్ కార్డులు జారీ, రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ నిధుల జమ, 9 రోజులలో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు అందించామని, క్వింటా సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని అన్నారు. పేదల సొంతింటి నిర్మాణాన్ని గత ప్రభుత్వం నిరక్ష ్యం చేస్తే ప్రజా ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే 4.5 లక్షలు ఇండ్లు మంజూరు చేశామని, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో 3500 పేదలకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని, 4 విడతల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల డబ్బులు విడుదల చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజులలో అర్హులైన పేదలందరికీ తప్పనిసరిగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు. సంక్షేమ హాస్టల్స్ లో చదివే పిల్లలకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ చార్జెస్ పెంచడం జరిగిందని అన్నారు. అనంతరం కూసుమంచి మండలం జీళ్లచెరువు ఎంపీపీఎస్, పాఠశాలలో 1వ తరగతి నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పీఎస్.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో షూస్, రెండు జతల సాక్స్ లను మంత్రి పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ యాకోబు, డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






## శివోహం..శివోహం..రామలింగని ఆస్తులకు అశృతర్పణం

**కోట్ల విలువైన భూముల అన్యాక్రాంతం**

**రెవెన్యూ పహణీల్లో గోల్‌మాల్**

**భూభారతి చూపించే యజమానులెక్కడివారు**

**సుప్రీం తీర్పుకి ఇది విరుద్ధం**

**సైట్ హ్యాకింగ్‌కి గురయిందా**

**తక్షణ విచారణకు భక్తుల డిమాండ్**

**చింతకాని/ప్రభాతవార్త**

వందన గ్రామ రామలింగేశ్వరాలయ భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డులంతా గందరగోళంగా మారాయి. సమాచార హక్కు ద్వారా మాకు అందిన సమాచారానికీ.,ఆన్‌లైన్ వివరాలకూ ఎక్కడా పొంతన కుదరడం లేదు. సర్వే నెంబర్ 60 లో దేవాదాయ శాఖ ఖాతాలో ఉండాల్సిన భూవిస్తీర్ణం గరిష్ఠంగా 16.1 ఎకరాలు. నిజానికి ఈ నెంబర్‌లో ఉన్న పూరా అంతే ఉన్నట్లు తెలుస్తుండగా.,స.హ చట్టం ద్వారా చింతకాని రెవెన్యూవారు జారీచేసిన పహణీలో కనిపిస్తున్న పట్టాదార్లకూ.,ఆన్‌లైన్‌కీ అసలు సారూప్యతే లేదు. ఈరెంటిలో రికార్డు పొజిషన్లో ఉన్న వారు వేరు వేరు. దీంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఈ నెంబర్‌ని మొత్తం 10 సబ్‌డివిజన్లుగా విడగొట్టారనే విషయాన్ని ఇప్పటికే చెప్పాం. ఐతే అసలు తొలుత పట్టాదార్లుగా దర్శనమిస్తున్న వారికే హక్కులు లేకపోగా, వీరి స్థానంలో ఆన్‌లైన్లో వేరొవరో వ్యక్తులు తిష్ఠవేయడం విడ్డూరం. 16.1 ఎకరాకిగానూ 13 ఎకరాల ఖరీదైన భూమి అన్యాక్రాంతమైపోయింది. ఆలయ భూముల్ని కాపాడాల్సిన రెవెన్యూ పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ఆ శాఖవారు బయటికొచ్చి అసలేం జరిగిందో సమాధానం చెప్పకపోగా.,తేలుకుట్టిన దొంగల్లా దొంగ నిద్రనటిస్తున్నారు. ఈ నెంబర్లో దేవాదాయశాఖకు ఆస్తి లేదనో లేదా ఉన్నదనో ధృవీకరించాల్సిన బాధ్యత వారిమీద ఉంటుందా ఉండదా. పత్రికల్లో రాసుకుంటే రాసుకున్నారులే.,నాల్గురోజులు రాసుకుని వాళ్ళే నోరుమూసుకుంటారులే అన్న చందంగా రెవెన్యూ తెంపరితనం ప్రదర్శిస్తున్నది. జిల్లా కలెక్టరేట్‌కి అత్యంత సమీపంలోనే ఇంతటి అరాచకానికి తెగబడుతుంటే.,ఇక ధర్మాన్ని కాపాడేదవరనే నిస్పృహ భక్తుల్లో కలుగుతున్నది. కుంట రూ.10లక్షకు పైగా అమ్ముడుపోతున్నదట. మరి పాలనాయంత్రాంగం కళ్ళుమూసుకుంటే ఎలా. దీనిపై లోతైన అధ్యయనం జరగాలనేది అందరూ కోరుకుంటున్నారు. రికార్డు పొజిషన్లో ప్రస్తుతమున్న వ్యక్తులకు ఈ హక్కులు ఎలా వచ్చాయో, వీరి లింకు డాక్యుమెంట్లేమిటో తేలాలి. మరోసారి అంటున్నామని అనుకోపోతే.,అసలీ సర్వే నెంబర్లో రామలింగనికి భూమి ఉందా లేదా. ఆ మాట రెవెన్యూ చెబుతుందా చెప్పదా. మౌనం వీడకపోతే అదే అంగీకారమనుకోవాల్సి వస్తుంది. ఇది ఇంతటితోపోదు. పెద్దఎత్తున ఉద్యమం జరగబోతున్నది. అన్యాక్రాంతానికి ఆనుపాను అందించిందెవరో బయటపడేదాకా భక్తులు ఒత్తిడి తెస్తారు. అప్పుడైనా అధికారులు నోరు విప్పక తప్పదు.

## నేడు నియోజకవర్గ బిఆర్ఎస్ సన్నాహక సమావేశం

**అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 29 ప్రభాతవార్త:**

మండల కేంద్రం అశ్వారావుపేట శ్రీ సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో నేడు అనగాశనివారం మద్యాహ్నం 2గంటలకు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశంజరుగుతుందని పట్టణ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ ఓ ప్రకటనలో తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సెప్టెంబర్ 10,11 తేదీలలో బిఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ పర్యటనఉన్న నేపథ్యంలో పేటలో నేడు ముఖ్య నాయకులు సన్నాహక సమావేశం జరుగుతుందనిఅన్నారు. నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుఅధ్యక్షతన జరుగు ఈ సమావేశానికి



జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు హాజరౌతారని కావున నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యమకారుల, మహిళా నాయకులు, యువజన నాయకులు, సోషల్‌మీడియా విభాగం, మైనార్టీ నాయకులు హాజరైన సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# యూరియా సరఫరా లేక 15 రోజులు

**తక్షణమే యూరియా అందించాలి రైతులు ఆందోళన..!**

*వైరా ఆగస్టు 29 ప్రభాత వార్త:*

వైరా సొసైటి కి యూరియా సరఫరా లేక 15 రోజులు అవుతుంది అని వెంటనే రైతులకు అవసరమైన యూరియా సకాలంలో అందించాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్



చేశారు.యూరియా రైతులకు వెంటనే సరఫరా చేయాలి అని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు.వైరా మండల వ్యవసాయ అధికారి మాయన్ మంజు ఖాన్, సొసైటీ సిఈఓ. కి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, పట్టణ కార్యదర్శి చింత నిప్పు చలపతిరావు మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో 18000 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు అయిందని పది వేల ఎకరాల్లో పత్తి పంట ఉందని పత్తి కాపు దశలో ఉండటం మరియు వరి పొలాలకు కలుపు మందులు వినియోగం వల్ల ఎర్రబారింది అని ఈ సమయం లో యూరియా వినియోగం ఎక్కువ ఉంటుందని రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేయాలి అని డిమాండ్ చేశారు.వైరా మండలం లో రైతులకు అవసరమైన యూరియా సకాలంలో సరఫరా చేయకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు, పైడిపల్లి సాంబశివరావు,బెజవాడ వీరభద్రం సంక్రాంతి నర్సయ్య, హరి వెంకటేశ్వరరావు, కొండూరు సత్యనారాయణ,కామినేని రవి పాల్గొన్నారు

# మృతురాలు చిత్రపటానికి నివాళులర్పించిన మున్నూరు కాపులు

*కారేపల్లి, ఆగస్టు 29: ప్రభాతవార్త*

సింగరేణి మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన మున్నూరు కాపు సంఘం మండల నాయకుడు వాకాటి సురేష్ మాతృమూర్తి వాకాటి సుజాత సంస్మరణ సభ శుక్రవారం కారేపల్లిలోని వైఎస్ ఎన్ గార్డెన్ లో జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు .ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా మున్నూరుకాపు సంఘం మహిళ అధ్యక్షురాలు పగడాల మంజుల.నాయకులు అడపా పుల్లారావు.ఏనుగుల ప్రకాష్,తెల్ల



శ్రీనివాసరావు,పగడాల నాగేశ్వరరావుతో పాటు సింగరేణి మండల మున్నూరుకాపు సంఘం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గమిడి నరసింహారావు,ముత్యాలసురేష్, పలువురు మున్నూరు కాపు కులస్తులు,వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరై వాకాటి సుజాత చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

# సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పై కామేపల్లి లో పీసా గ్రామసభ

**రైతుల అభిప్రాయాలను స్వీకరించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి**

*కామేపల్లి,ఆగస్టు 29 ప్రభాతవార్త:*

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పై కా మేపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయం లో పంచాయతీ స్పెషలాఫీసర్ బి.తారా దేవి అధ్యక్షత శుక్రవారం పీసా గ్రామ సభ ను నిర్వహించారు.కామేపల్లి మండలం లో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా పీసా చట్ట ప్రకారం ఎకరాలు 20.01 కుంటలు గాను పీసా చట్ట ప్రకారం గ్రామసభ ను నిర్వహించడం జరిగింది. గ్రామ సభలో భూసేకరణ అధికారి రాజే శ్వరి ( స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఐ పి టి, రైల్వేస్) ఖమ్మం,తాసిల్దార్ సిహెచ్ సుధాక ర్,స్పెషల్ ఆఫీసర్,అగ్రికల్చర్ ఆఫీసర్ భూ క్య తారా దేవి, ఇరిగేషన్ డిఈఈ బి.శంక ర్,పంచాయతీ సెక్రెటరీ నరసింహ,పీసామొబలైజర్ ముక్తి సాంబశి వరావు,ఆర్ఐ లు విజయ, విజయ భాస్కర్, రెవెన్యూ సిబ్బంది కె.శ్రీను, ఉపేందర్, రమేష్,రైతు లు దుగ్గి కృష్ణ, అజ్మీర రాందాస్ నాయక్, అంతోటి అచ్చయ్య, కొర్ర రాములు, సురేష్, ఎం.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





# వైరా ఇండోర్ స్టేడియంలో జాతీయ క్రీడల దినోత్సవ వేడుకలు..!

*వైరా ఆగస్టు 29 ప్రభాతవార్త:*

ఈరోజు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వైరా ఇండోర్ స్టేడియంలో అండర్13,అండర్15, అండర్17 బాల,బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి డాక్టర్ కాపా మురళీకృష్ణ ఈ క్రీడా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత హాకీ మాంత్రికుడు దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ గౌరవార్థం.. ఆయన జన్మదినమైన ఆగస్టు 29 భారతదేశంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.మొదటి జాతీయ క్రీడా దినోత్సవాన్ని 2012లో జరుపుకున్నారు. మేజర్ ధ్యాన్ చంద్ వారసత్వాన్ని గౌరవించడం, క్రీడలను ప్రోత్సహించడం, అవగాహన పెంచడం, భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, క్రీడా సంస్కృతిని నిర్మించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.ప్రతి ఏడాది ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటారు.జాతీయ క్రీడా దినోత్సవం ప్రధాన లక్ష్యం క్రీడల ప్రాముఖ్యత గురించి దేశంలోని సామాన్య ప్రజానీకంలో కూడా అవగాహన కల్పించడం. 2012 నుంచి భారతదేశంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.జాతీయ ఐక్యతను,ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి,యువ తరాన్ని క్రీడారంగంలో ముందుకు తీసుకుపోవాలని క్రీడాకారులను కోరారు.ఈ కార్యక్రమం కోచ్ షేక్ అంజాద్ పాషా, కానిస్టేబుల్ గోపాల్ పాల్గొన్నారు.






# మైనారిటీల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కి వినతి

*కారేపల్లి ఆగస్టు 29 ప్రభాతవార్త*

సింగరేణిమండలంలోని మైనారిటీల పలు సమస్యలు పరిష్కరించాలని, అదేవిధంగా అర్హులైన మైనారిటీలకు సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సింగరేణి మండల మైనారిటీ నాయకులు శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ ను కొత్తగూడెం లోని ఆయన నివాసంలో కలిసి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన మైనారిటీలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, అదేవిధంగా రాజీవ్ యువ వికాస్ పథకంలో మైనారిటీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. ఇంకా మసీదుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, మైనారిటీలకు ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరామని, అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మండలంలోని మైనారిటీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ హనీఫ్, షాదిఖానా చైర్మన్ షేక్ షఫీ , కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ,యువనేత షేక్ మజీద్ పాషా (షేరు), షేక్ సైఫ్ ,తదితరులు ఉన్నారు.



# పంచాయతీ కార్యాలయాలు నిర్మాణాలు పూర్తయ్యేది ఎన్నడు!

**33నెలలుగా బిల్లుల కోసం మాజీ సర్పంచుల నిరీక్షణ**

**నిర్మాణాలు పూర్తి అయిన విడుదల కాని నిధులు**

**విద్యుత్ సౌకర్యం లేని బజ్జ తండా గ్రామపంచాయతీ**

**ఆర్థిక భారంతో సతమతమవుతున్న మాజీలు**

*కారేపల్లి ఆగస్టు 29 ప్రభాతవార్త*

పల్లెల్లో సకల సౌకర్యాలు కల్పించి ప్రగతిబాటలో నడిపిస్తూ పట్టణాలకు వలసలు అరికట్టాలని అప్పటి తెలంగాణ ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్య నిర్వహణ, వీధిదీపాల ఏర్పాటుతో పాటు పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు నిర్మించి పల్లెలు పట్టణశోభను సంతరించుకునేలా అభివృద్ది పనులకు శ్రీకారం చుట్టింది. మొదటి, రెండు విడతల పల్లెప్రగతి కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగిపోయినా మూడు, నాలగవ విడతలకు వచ్చే సరికి నిధుల సమస్య ప్రతిబంధకంగా మారింది. ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ఫ్రీజింగ్ విధించడంతో పనులు చేపట్టిన సర్పంచులకు, కాంట్రాక్టర్లకు బిల్లులు అందక అప్పులు అమ్ముకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. పనులు పూర్తిచేసి కొందరు అప్పుల బాధతో అల్లాడుతుంటే నిధులు లేక పెట్టిన డబ్బు చేతిక రాక అర్ధాంతరంగా పనులు నిలిపివేసినవారు మరికొందరున్నారు. పల్లె ప్రగతి పనులు పూర్తిచేయాలంటూ ఆనాడు జిల్లా కలెక్టర్ల ఒత్తిడి పెరిగిపోవడంతో పనులు పూర్తి చేసి సర్పంచులు దిక్కుతోచని స్థితిలోపడిపోయారు. నేడు నూతన ప్రభుత్వం పూర్తి చేసిన పనులకు నిధులు విడుదల చేస్తారని వేయి కళ్ళతో మాజీ సర్పంచులు వీక్షి స్తున్నారునూతన పంచాయితీ కార్యాలయాల నిర్మాణం చేపట్టాలని అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు అప్పులు తీసుకొచ్చి నిర్మాణాలు పూర్తిచేసిన పంచాయితీ కార్యాలయాలపై బకాయిల భారం అధికం కావడంతో నిర్మాణాలు పూర్తిచేసిన సర్పంచులకు నేడు పెనువారంగా మారింది నిర్మాణాలు కొంతమేర పూర్తిచేసిన మాజీ సర్పంచులు కాంట్రాక్టర్లు కు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పలువురు ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు 33 బిల్లుల కోసం నిరీక్షి స్తున్న నేటికీ విడుదల కాకపోవటం తో దిక్కు తోచని స్థితిలో సర్పంచులు కొట్టుమిట్టాడుతున్నారు సింగరేణి మండలం లో 16 పంచాయతీ కార్యాలయాలు నిర్మాణాలు చేపట్టగా బజ్జ తండా పాత కమలాపురం గాదెపాడు గ్రామపంచాయతీలు నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభోత్సవాలు జరిగాయి. గుట్ట కింద గుంపు గుంపెళ్ళగూడెం నాను నగర్ తండా గ్రామపంచాయతీల నిర్మాణాలు పూర్తయిన బిల్లులు రాకపోవడంతో గత కొన్ని నెలలుగా అర్ధాంతరంగానే ఆగిపోయాయి.బజ్జ తండా పంచాయతీ లు మంజూరు చేసిన 20 లక్షల రూపాయలకదనంగా మరో రెండు లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తయింది కానీ విద్యుత్ సరఫరా ఇవ్వాలంటే అదనంగా డిడి చెల్లించాల్సి ఉన్న పంచాయతీలో నిధులు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది ప్రస్తుతం గ్రామపంచాయతీ భవనానికి విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో ఇబ్బందికరంగా మారింది కార్యాలయంలో ఏర్పాటుచేసిన లైట్లు ఫ్యాన్లు అలంకారప్రాయాలుగా మారాయి విద్యుత్ శాఖ చొరవ తీసుకొని విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అదేవిధంగా కాంపౌండ్ వాల్ లేకపోవడం కార్యాలయం ఆవరణలో నాటిన చెట్లకు రక్షణ కరువైంది 2023 డిసెంబర్లో బజ్జ తండా గ్రామపంచాయతీ కార్యాలయం నిర్మాణం పూర్తి చేసుకొని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తో ప్రారంభించడం జరిగిందికానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి బిల్లు కూడా రాలేదని, ఈ విషయంపై ఆఫీసర్లను అడిగితే ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉందని చెబుతున్నారని మాజీ సర్పంచ్ బానోత్ సంధ్యారాందాస్ వాపోయారు. నిర్మాణాల దశలో ఉన్న కార్యాలయాలకుఅయితే ఇప్పటివరకు ఏ పంచాయతీకి నిధులు విడుదల కాకపోవడం ఆర్థికంగా సంబంధిత సర్పంచులు కాంట్రాక్టర్లు నానా ఇబ్బందులు పడుతున్నారుఇప్పటివరకు స్లాబ్ పూర్తి కాగా ఫ్లోరింగ్, కరెంట్ పనులు పెండింగ్లో ఉన్నాయి. ఇప్పటివరకు గుట్ట కింద గుంపు గ్రామపంచాయతీ కార్యాలయ నిర్మాణ పనులకు రూ.16లక్షలకు పైగా చేసినా ప్రభుత్వం రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో అప్పులు తెచ్చి పనులు చేశామని, వాటిని వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని మాజీ సర్పంచ్ ఎట్టి రజని రామారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణపు పెండింగ్ బిల్లులు విడుదల అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు..,



# రామానగరంలో పడకేసిన పారిశుద్ధ్యం...

## - వర్షాలతో వీధులన్నీ బురదమయం...



**సత్తుపల్లి ఆగస్టు 29 ప్రభాతవార్త :** సత్తుపల్లి మండలం రామానగరం గ్రామంలో ఏ వీధిలో చూసినా పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని అధికారులు ఎవరు పట్టించుకోవడంలేదని సిపిఐ నాయకులు దండు ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గ్రామంలో శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో కొత్త కాలనీ, బూరుగుమాలు పెల్లి, మందులు బజారు, తూర్పు బజారు కాలనీ, క్రిస్టియన్ పేట, బురద, చెత్తాచెదారంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అవన్నీ సకాలంలో తొలగించకపోతే అంటువ్యాధులు ప్రబులుతాయని తద్వారా విష జ్వరాలు సోకే అవకాశం ఉందని దండు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు మూలంగా పైవీదులన్నీ బురద మయంగా తయారయ్యాయి ఆయన అన్నారు. గత మూడు నెలలు నుండి వీధిలైట్లు లేక చీకటమయంగా ఉంటున్నాయని అధికారులకు చెప్పిన అదుగో ఇదిగో అంటున్నారు తప్ప ఎవరూ పట్టించుకోవటం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయని సకాలంలో అధికారులు పట్టించుకోని పరిష్కరించకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని దండు ఆదినారాయణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత అమల జాను సంజీవరావు రూతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి సింగరేణి కాలనీలో సూపర్ బజార్ నిర్మించాలని...

## - సూపర్ బజార్ ఎండిని కలిసిన రజాక్



సత్తుపల్లి ఆగస్టు 29 ప్రభాతవార్త :

కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి సింగరేణి పి.వి నరసింహారావు కాలనీ నందు సూపర్ బజార్ కట్టించాలని, ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, యూనియన్ నాయకులతో కలిసి సూపర్ బజార్ ఎండి విలాస్ శ్రీనివాస్ పోతేదార్ ను శుక్రవారం కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్తుపల్లి లోని జేవిఆర్ఓసి, కిష్టారం ఓ.సి.పి, లలో పని చేయుచున్న ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ప్రతిరోజు పివిఎన్ కాలనీ నుండి రెండు కిలోమీటర్లు సత్తుపల్లి పట్టణంలోకి వెళ్లి నిత్యవసర సరుకులు తీసుకురావడం ఇబ్బంది కలుగుచున్నందున కాలనీలోనే సూపర్ బజార్ ఏర్పాటు చేసినచో సింగరేణి ఉద్యోగులకు సదుపాయం కల్పించినట్లు అవుతుందని, ఐఎన్టియుసి ట్రేడ్ యూనియన్ ద్వారా కోరడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించి ఈ సమస్యల్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీతారామరాజు, ఎం.కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటు గురై మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే...

సత్తుపల్లి ఆగస్టు 29 ప్రభాతవార్త :



సత్తుపల్లి మండలం పాకాలగూడెం గ్రామం లో రాత్రి పూట ఇంటిలో కింద నిద్ర పోతు ఉండగా గౌర గోపి, నాగ మోనిక కుమార్తె లోహిత (5) పై పాము కాటు వెయ్యగా చిన్నారి మృతి చెందటం తో తల్లి నాగ మోనిక వైద్యం చేయటంతో ఆమె ఆరోగ్యంగా కోలుకుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ విజయ్ కుమార్లు శుక్రవారం వెళ్లి వారి కుటుంబాన్నిపరామర్శించారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివా వేణు,సీనియర్ నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, గ్రామస్తులు సుభాని, బాషా,తానీషా, అప్పారావు, శ్రీను, మల్లేశ్వరరావు, మురళి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. బేతుపల్లి చెరువు పరిశీలించిన డాక్టర్ మట్ట... సత్తుపల్లి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని నవరాత్రుల పూజలు అనంతరం గణనాధులను నిమజ్జనం చేయటానికి ఏర్పాటు చేసిన బేతుపల్లి ఘాటు వద్ద పరిస్థితులను శుక్రవారం పరిశీలించారు. నిమజ్జనం సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని వారు అధికారులు కోరారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివ వేణు సీనియర్ నాయకులు దొడ్డ శ్రీనివాసరావు , అప్పారావు సాయిలు జయరాజు సుభాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నూతనకల్‌లో సిపిఎం సర్వే

తల్లాడ, ఆగస్టు 29, ప్రభాతవార్త :



స్థానిక సమస్యలపై సిపిఎం పార్టీ మండల పరిధిలోని నూతనకల్ గ్రామంలో శుక్రవారం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. ఇప్పటి వరకు ఇచ్చిన సంక్షేమ పథకాలు సరైన పద్ధతిలో లేకపోవడంతో పేదలు మరింత నిరుపేదలుగా మారుతున్నారన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక గ్రామాలు దోమలకు నిలయాలు మారయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి కాలనీలలో విద్యుత్ దీపాలు, పారిశుద్ద్యం, మురికినీరు, డ్రైనేజీ వ్యవస్థలను సరిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో పంచాయితీ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళ్యాణపు కృష్ణయ్య, సత్తెనపల్లి నరేష్, వంగూరి లోకేశ్వరరావు, కృష్ణయ్య, రాము, రవి, గోపి తదితరులు న్నారు.

# నేడు కల్లూరుకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

## - ఆసరా పింఛనుదార్ల సభ విజయవంతం చేయండి

## - ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి



కల్లూరు, ఆగస్ట్ 29, ప్రభాతవార్త:

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నేడు కల్లూరు రానున్న సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఆసరా ఫించన్ దారులు అధిక సంఖ్యలో పాల్గొని, కల్లూరు కృష్ణ మార్కెట్ యార్డ్ లో జరుగు సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు పిలుపునిచ్చాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్లు పెంచుతామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా కూడా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోనందున ఆసరా ఫించన్ దారులు సెప్టెంబర్ నెలలో హైదరాబాద్ లో జరిగే బహిరంగ సభ విజయవంతం కొరకు కల్లూరు లో నేడు జరుగుతున్న సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకొని, వికలాంగుల ఆసరా ఫించన్ దారులకు అండగా నిలవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సభకు కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సునీల్ మాదిగ, సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి దారెల్లి వెంకటేశ్వరరావు, కల్లూరు మండల ఎంఆర్పిఎస్ నాయకులు ఖమ్మంపాటి పుల్లారావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, వెంగళ వెంకటేశ్వర్లు, నల్లగట్ల వేణు, నల్లగట్ల కోటేశ్వరరావు, ఖమ్మంపాటి వెంకటేశ్వర్లు, మోదుగు రమేష్, మాతిపోగు రాము, టౌన్ అధ్యక్షులు ఆదూరు కిరణ్ కుమార్, మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గోపాలస్వామి, కిన్నెర యాకూబ్, జొన్నలగడ్డ నవీన్, కొరకొప్పు ప్రసాద్, మల్లాది ప్రసాద్, చెరుకుమల్లి శేఖర్, ఎంఆర్పిఎస్, ఎంఎస్ఎఫ్, విహెచ్పిఎస్, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# సత్తుపల్లి సింగరేణి కాలనీలో ఘనంగా గణపతి ఉత్సవాలు..

సత్తుపల్లి ఆగస్టు 29 ప్రభాతవార్త :



సత్తుపల్లి సింగరేణి పి.వి.ఎన్ కాలనీ నందు గత 3 మూడు సంవత్సరాలుగా సింగరేణి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుంది. దానిలో భాగంగా ఈ సంవత్సరం వినాయక చవితి పండుగ కార్యక్రమంలో విగ్రహ దాత తాటిపాముల మోహన్ , సంధ్య రాణి దంపతులు, గణేష్ లడ్డు దాత కాటరి సంపత్ కుమార్ , నిరంజని దంపతుల ను గణేష్ కమిటీ సభ్యులు సత్కరించి అభినందించారు.కాలనీ కుటుంబ సభ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో 9 రోజుల పాటు ప్రతిరోజు జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళ సోదర సోదరీమణులు , ఆడపడుచులుకుంకుమపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి సన్నిధిలో సోమవారం జరిగే మహా అన్నదానం వేడుకల్లో సింగరేణి కాలనీ కుటుంబ. సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని కమిటీ సభ్యులు కోరారు.

# సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్‌కి దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలి: సిపిఐ

**సత్తుపల్లి ఆగస్టు 29 ప్రభాతవార్త :** సత్తుపల్లి పట్టణంలోని వివిధ




కాలనీలలో సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన వెంగళరావు నగర్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, విరాట నగర్, ద్వారకాపురి కాలనీ, గాంధీనగర్, రాజీవ్ నగర్ కాలనీ,కొత్తూరు., రేజర్ల., తదితర కాలనీలలో,. సింగరేణి సంస్థ బాంబ్ బ్లాస్టింగ్ వల్ల గోడలు నేర్రలిచ్చి ఇల్లు పైకప్పు బద్దలుగా పగలడం ద్వారా ఈ అకాల వర్షాలకు ఇల్లులంతా తడిసికరెంట్ షాక్ గురవుతున్నారని వీరందరినీ సింగరేణి సంస్థ పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు నిమ్మటూరిరామకృష్ణ కోరారు. సింగరేణి సంస్థ ఇటీవల కాలంలో కొన్ని ఇళ్లను గుర్తించి మైనర్ రిపేర్లు కొరకు కాంటాక్ట్ ద్వారా చేసే పనులు సక్రమంగా చేయటం లేదని ఇంటి యజమాని చెప్పిన విధంగా పనులు చేయించాలని రామకృష్ణ కోరారు. ఇంటి యజమానికి అనుకూలంగా మైనర్ రిపేర్లు చేయించాలని అలాగే సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రభావిత ప్రాంతాల ప్రజలకు నెలకు రెండు సార్లు మెడికల్ క్యాంపు నిర్వహించాలని సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఆస్తమా., చర్మవ్యాధులు., క్యాన్సర్.,షుగరు., బిపి., వివిధ జబ్బులు వస్తున్నాయని తక్షణమే సింగరేణి సంస్థ పర్యావరణ చర్యలు తీసుకోవాలని రామకృష్ణ కోరారు. అలాగే వివిధ వార్డుల్లో మంచినీళ్ల సదుపాయం కొరకు ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారని వాటిని వాడకంలో తీసుకురావడం కొరకు ఒక కార్మికురాలని సింగరేణి సంస్థ నియమించాలని ఈ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సింగరేణి జెవిఆర్ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్ కి శుక్రవారం వినతి పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ కార్యదర్శి తడక మల్ల యోబు సిపిఐ పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య., పట్టణ కమిటీ సభ్యులు ఎరజాల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాకు 50 ఆటోమేటిక్

## ప్యాడీ క్లీనర్స్ మంజూరు

### మార్కెట్ ఆదాయం టార్గెట్ సాధించేందుకు కృషి

### రూ.150 కోట్లతో మిర్చి మోడల్ మార్కెట్ పనులు

### జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి యం.ఏ. అలీం

*నేలకొండపల్లి, ఆగస్టు 29 (ప్రభాతవార్త):*

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 50 ఆటో మేటిక్ క్లీనర్స్ ను మంజూరు చేసినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి యం.ఏ. అలీం వెల్లడించారు. శుక్రవారం నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. పలు రికార్డులను ఆయన పరిశీలించారు. శనివారం



నిర్వహించనున్న ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్స్ అవగాహాన కార్యక్రమం పై అధికారులతో ఆయన సమీక్షి ంచారు. అనంతరం, స్థానిక విలేకరులతో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి యం.ఏ అలీం మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్స్ వినియోగం పై నేలకొండపల్లిలో డేమో కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. శనివారం జిల్లా లోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులు సిబ్బందికి అవగాహన కల్పించున్నట్లు ఆయన చెప్పారు. గతంలో ఉన్న 256 ప్యాడీ క్లీనర్స్ కు కొత్తగా వచ్చిన క్లీనర్స్ కు అనుసంధానం చేసి వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో తొలిసారిగా నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కు డ్రయ్యర్ ను మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలోనే మిగతా మార్కెట్లకు అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో గత సీజన్ లో 232 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అదనంగా మరో 50 కేంద్రాలు ఈ సీజన్ కు పెంచే అవకాశం ఉన్నట్లు ఆయన చెప్పారు. అందుకు గాను రూ.150 కోట్ల తో పనులు చేపట్టినట్లు ఆయన చెప్పారు. జిల్లాలో కొత్తగా మంజూరైన మద్దులపల్లి మార్కెట్ కు స్థలం పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారితో పాటు వివిధ శాఖల అధికారులు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ నందు జరిగే డెమో కార్యక్రమం కు హాజరువుతున్నట్లు ఆయన తెలిపారు.


## విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి వెల్లడి

### ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు

*నేలకొండపల్లి ఆగస్టు 29 (ప్రభాతవార్త):*

విద్యార్థులు, యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి వెల్లడించారు. ప్రముఖ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు శుక్రవారం నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి మాట్లాడుతూ 2012లో భారత ప్రభుత్వం ధ్యాన్‌చంద్ భారతీయ క్రీడలకు చేసిన సేవలను గుర్తించి ఆయన పుట్టినరోజును జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. దీని ప్రధాన ఉద్దేశ్యం గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడం, వారికి అవగాహన కల్పించి ప్రోత్సహించడం, మెరుగైన సౌకర్యాలు కల్పించడం, క్రీడా సంస్కృతిని నిర్మించడం, సామాన్య ప్రజానీకంలో క్రీడలపై అవగాహన పెంచడం జాతీయ క్రీడా దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతి ఒక్కరినీ క్రీడల్లో నిమగ్నం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన భారత దేశాన్ని నిర్మించవచ్చు అన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు పరిమితం కాకుండా శారీరక దృఢత్వం కోసం ఆటలు ఆడాలని, కళాశాలకు విశాలమైన క్రీడా మైదానం ఉన్నదని విద్యార్థులు దీనిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ అధ్యాపకులు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.వెంకటేశ్వర్ రెడ్డి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రమేష్, డాక్టర్ ఎస్.నారాయణస్వామి, ఎన్.వెంకన్న ఇతర అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్యాక్స్ కేంద్రాల ద్వారా రైతులకు యూరియా సరఫరాకు చర్యలు

### యూరియా పంపిణీలో చిన్న అవకతవకలు జరిగినా స్పాట్ లో సస్పెండ్

### కూసుమంచి కార్యాలయంలో యూరియా సరఫరాపై సమీక్షించిన మంత్రి పొంగులేటి

*కూసుమంచి, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :*

పాలేరు నియోజకవర్గం పరిధిలో ఇక నుంచి ప్యాక్స్ కేంద్రాల ద్వారా మాత్రమే రైతులకు యూరియా సరఫరా జరగాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి యూరియా సరఫరాపై శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షి ంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... ఏప్రిల్ నెల నుంచి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి



కేటాయించిన స్థాయిలో యూరియా సరఫరా చేయని కారణంగా కొంత యూరియా కొరత మన రాష్ట్రంలో ఉందని అన్నారు. రామగుండం ఆర్ఎఫ్.సీ.ఎల్. ఉత్పత్తి సాంకేతిక సమస్యల వల్ల నిలిచిపోయిందని అన్నారు. ఖమ్మం జిల్లాకు రాబోయే 7 రోజులలో 1600 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ వస్తుందని అన్నారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో ప్యాక్స్ సొసైటీల ద్వారా మాత్రమే రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. యూరియా అక్రమ రవాణాను అరికట్టాలని అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా క్రమ పద్ధతిలో రైతులకు యూరియా పంపిణీ చేసేందుకు కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. యూరియా పంపిణీలో ఎటువంటి తప్పులు జరగరాదని అన్నారు. గత సంవత్సరం కంటే ఎక్కువ యూరియా అమ్మినట్లు రిపోర్టు ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో సమస్య ఉండటం ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు. వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా అమ్మకం యూనిట్లను పెంచాలని, సహకార శాఖ, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బందిని డిప్యూటేషన్ లో తీసుకోవాలని, పోలీస్ అధికారుల సహకారం తీసుకోవాలని, రైతులకు నేరుగా యూరియా అందించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఇక నుంచి ప్రైవేటు రంగానికి యూరియా బ్యాగ్ ఇచ్చే ఆస్కారం లేదని, వ్యవసాయ సహకార సంఘాల నుంచి అదనపు సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి యూరియా పంపిణీ చేయాలని, సెప్టెంబర్ సీజన్ ముగిసే వరకు యూరియా అమ్మకాలకు అనుమతిస్తూ టెంపరరీ లైసెన్సులు జారీ చేయాలని అన్నారు. యూరియా పంపిణీలో ఎవరైనా చిన్న అవకతవకలకు పాల్పడినా స్పాట్ లో సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ కు మంత్రి స్పష్టం చేశారు. ప్రతి సబ్ సెంటర్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. యూరియా పంపిణీ పర్యవేక్షణకు రెవెన్యూ డివిజన్ అధికారిని నియమించాలని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డీ పుల్లయ్య, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఏడీఏ, ఏవో, సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

## ఓటర్ ల జాబితా అభ్యంతరాల పై యంపీడీవోకు ఫిర్యాదు చేసిన మాజీ ప్రజాప్రతినిధులు

*నేలకొండపల్లి, ఆగస్టు 29 (ప్రభాతవార్త):*

నేలకొండపల్లి గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితా పై నేలకొండపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచులు రాయపూడి నవీన్ ,మామిడి వెంకన్న, మాజీ ఎంపీటీసీ బొడ్డు బొందయ్య పలు అభ్యంతరాలు వ్యక్తం చేసారు. ఈ మేరకు శుక్రవారం నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎంపీడీవో యం. యర్రయ్య ను వారు కలిసి ఫిర్యాదు చేసారు. ఒకే కుటుంబంకు చెందిన ఓటర్ లు, కుటుంబ సభ్యులు ఒక వార్డులో కొంత మంది మరి కొంత మంది వేరొక వార్డులో పేర్లు ఉన్నాయని వారు ఫిర్యాదు చేసారు. అదే విధంగా ఒక వార్డు కు చెందిన ఓటర్ల ఒకే చోట లేకుండా వీధులు చాలా దూరంలో ఉన్నాయని, ముఖ్యంగా 9 వార్డు నుంచి 13 వార్డు వరకు ఓట్లు ను ఒకే వార్డు ఒకే ప్రదేశం లో ఉండేలా చూడాలని వారు కోరారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాలకు కూడ అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఓటర్ లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో యం. యర్రయ్య చెప్పారు.ఓటర్ల జాబితా పై వచ్చిన అభ్యంతరాలను జిల్లా అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. అదే విధంగా శనివారం ఓటర్ల జాబితా పై జరిగే రాజకీయ నాయకుల సమావేశను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, గుడిబోయిన వెంకటేశ్వర్లు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.






## నేడు అఖిలపక్ష నాయకులతో సమావేశం

### ఎంపీడీవో రాంచందర్ రావు

*కూసుమంచి, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :*

సాధారణ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్



నియమావళిని అనుసరించి, జిల్లా కలెక్టర్ ఆదేశాను సారం నేడు (శనివారం) మండలపరిషత్ కార్యాలయంలో అఖిలపక్షనాయకులతో ఉదయం 11గంటలకు సమావేశం ఏర్పాటు చేయనున్నదని ఎంపీడీవో రాంచందర్ రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా, పోలింగ్ స్టేషన్ల వారీగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై తమతమ అభిప్రాయాలు తెలియపరిచేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని రాజకీయపార్టీల నాయకులు సకాలంలో హాజరై తమతమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

## ముగిసిన నవోదయ దరఖాస్తు గడువు

### ఈనెల 30 వరకు సవరణలకు అవకాశం

*కూసుమంచి, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :*

ఖమ్మం జిల్లాలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో 2026 27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి గడువు ఈనెల 27 వరకు ముగిసినట్లు ప్రిన్సిపాల్ కే. శ్రీనివాసులు పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుల్లో తప్పులను ఈనెల 30 వరకు ఎడిట్ ఆప్షన్ తో సవరించుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారంలో ఎడిట్ చేసుకోవడానికి అభ్యర్థి పేరు, తల్లి /తండ్రి పేరు, పుట్టిన తేదీ, లింగం, జాతీయత/కులం, చిరునామా, పాఠశాల వివరాలు వాటిని ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించారని తెలిపారు.

## గాంధీపథం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

*కొత్తగూడెం టౌన్, ఆగస్టు 29 - (ప్రభాతవార్త):*

గాంధీపథం, పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఘనంగా సన్మానించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ముచ్చటగా మూడోసారి కూడా ఎంపికైన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి పుష్పగుచ్ఛాలు అందించారు. స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో చింతలచెర్వు గెర్షోమ్, నర్సయ్య, కళావతి, రఘుపతి, సుమన, శ్రీకాంత్, శ్రీరాములు, జ్ఞాన వినోదిని, రామ తులసి, ఎర్నస్ట్ లీనా, ఎలిజబెత్, ఎఫ్రాయిల్ పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకోసమే కాటమయ్య రక్షకిట్లు



**పేదల పక్షపాతిగా రాష్ట్రంలో ప్రజాపాలన**

**కాటమయ్య కిట్ల పంపిణీలో మంత్రి పొంగులేటి**

**కూసుమంచి, ఆగష్టు 29 (ప్రభాతవార్త) :** ప్రమాదాల నివారణ కోసం కాటమయ్య రక్షక కిట్లను గీత కార్మికులు తప్పనిసరిగా వినియోగించాలని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి 80 మంది లబ్ధిదారులకు శుక్రవారం కాటమయ్య కిట్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...కల్లుగీత కార్మికులకు పూర్తిస్థాయిలో కాటమయ్య రక్షక కిట్లను అందించే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా కుల వృత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నీటి వనరుల్లో చేప పిల్లల విడుదల, కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఈత చెట్లు ఎక్కే సమయంలో కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా సాంకేతికంగా, శాస్త్రీయంగా కాటమయ్య రక్షక కిట్లను తయారుచేయడం జరిగిందని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు భరోసా కల్పించామని అన్నారు. రైతులకు మద్దతుగా 21 వేల కోట్లతో 2 లక్షల వరకు పంట రుణమాఫీ, 9 రోజులలో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ, క్వింటా సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ వంటి కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ ద్వారా పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, గత ప్రభుత్వం నిరక్ష్యం వహించిన రేషన్ కార్డు సమస్యలను ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పరిష్కరించి 7 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని అన్నారు. పేదలకు అండగా ఉండే మన ప్రభుత్వం మొదటి విడత నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసామని అన్నారు. రాబోయే రోజులలో ప్రతి ఒక్క అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ళను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. గీత కార్మికుల సమస్యల తొలగించేందుకు ప్రభుత్వం భవిష్యత్తులో అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జీ. జ్యోతి, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, కూసుమంచి మండల తహసీల్దార్ రవి కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆ పామాయిల్ రైతు వద్ద అల్లాఉద్దీన్ అద్భుత దీపం

**ఎనిమిది నెలల్లో రూ.4కోట్లపైగా ఆదాయం**

**అక్కడున్నది కేవలం 17 ఎకరాలే**

**ఎకరాకి 130 టన్నుల దిగుబడి**

**ఆశ్చర్యం కలుగుతున్నదా..ఇది పచ్చినిజం**

**విచ్చలవిడిగా తెలంగాణాకి ఆంధ్రా సరుకు**

**ఓ ప్రైవేటు కంపెనీకి వెన్నపోటు**

**ఎన్ని ఫిర్యాదులు చేసినా దిక్కులేదు**

**పెద్దస్థాయిలో వివాదమవుతున్న వ్యవహారం**

**అశ్వారావుపేట/ప్రభాతవార్త**

ఫట్టుమని ఆ పామాయిల్ రైతుకి 18 ఎకరాలైనా లేదుగానీ., కేవలం 8 మాసాల్లో ఒక ఎకరాకి 130కి పైగా టన్నుల దిగుబడి సాధించి, రూ. 4కోట్లను దాటి ఆదాయాన్ని సొంతం చేసుకుని ప్రపంచ రికార్డుని సొంతం చేసుకుంటున్నారు. ఇదెక్కడో కాదు సుమా., అశ్వారావుపేట, అప్పారావుపేట ఆయిల్‌పాం ప్రాసెసింగ్ యూనిట్ల పరిధిలోనే. వినడానికి వింతగా ఉంది కదా. ఆరైతు చేతుల్లో ఏదో మహత్తర శక్తులుంటే మాత్రం ఇదెలా సాధ్యమనుకుంటున్నారా., అల్లాఉద్దీన్ అద్భుతదీపం వల్లా కాదనే దీర్ఘాలోచనలో పడుతున్నారా., లేదు లేదు అసాధ్యాన్ని సుసాధ్యం చేసి మలేషియా, ఇండోనేషియా వంటి దేశాలకే ధీటుగా ఎకరాకి కేవలం 8 మాసాల్లో 130 టన్నుల దిగుబడి సాధించిన ఆ జగజ్జేత కథాకమామీషు ఇలా ఉన్నది.

**అసాధ్యం సుసాధ్యమెలా అయింది**

ప్రభాతవార్త వద్ద ఉన్న పక్కా ఆధారమిది. 07.01.2025 తేదీ నుంచి 27.08.2025 తేదీల మధ్యన ఆ రైతు తన సొంత ఫార్మర్ కోడ్‌మీద ఫ్యాక్టరీకి సరఫరా చేసిన మొత్తం ముడి పామాయిల్ (ఎఫ్ఎఫ్‌బి) అక్షరాలా ఈ ఏడున్నర మాసాల్లో 2వేల2వందల25 టన్నులు. బిల్లు రూ. 4కోట్లకు పైమాటే. ఇంకో గమ్మత్తయిన విషయమేంటో తెలుసా కేవలం ఈ ఆగష్టు మాసంలోనే ఒకే తేదీతో పలు రకాల భారీ



వాహనాల్లో ఈయనకు చెందిన ఫ్రూడ్‌కోడ్‌మీద 100 టన్నులకు పైగా ఫ్యాక్టరీలో అన్‌లోడ్ అయినట్లు ప్రభాతవార్త వద్ద అధికారిక డాటా ఉన్నది. ఇలా అనేకమార్లు జరిగింది. మరి ఆయనకున్న తక్కువపాటి విస్తీర్ణంలో ఏకకాలంలో వందలాది టన్నుల ముడి పామాయిల్ దిగుబడులు ఎలా వస్తున్నాయో సగటు రైతాంగం తెలుసుకోవాలనుకుంటున్నది. నిజంగా ఇన్నివేల టన్నుల్ని తోటలోనే పండించారా అంటే సూర్యుడు పడమటనే పొడుస్తాడని చెప్పినా నమ్మవచ్చుగానీ., అసలిది ప్రకృతికి విరుద్ధం కదా. మరి ఒకే ఫ్రూట్‌కోడ్‌మీద ఇంతపెద్దమొత్తంలో రవాణా ఎలా జరుగుతున్నదో ప్రపంచంలో 8వ వింతే కదా.

**ఆంధ్రా సరుకు కొంటున్నారా**

పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని దిగుబడుల్ని కొనుగోలు చేస్తున్నకారణంగానే ఇన్నివేల టన్నులు రికార్డయినట్లు విపరీత ప్రచారం జరుగుతున్నది. నిజానికి ఆ ఏరియా ఓ ప్రఖ్యాత ప్రైవేటు కంపెనీది. వారి ప్రాంతం నుంచి వారి యూనిట్లకు చేరాల్సిన ఫ్రూట్ ఈవిధంగా మరోచోటకి తరలిపోతే., వ్యాపార రీత్యా వాళ్ళకీ తీవ్ర నష్టమే. అందుకనే ఆ కంపెనీ యాజమాన్యం ఈ తాజా పర్యవసానాలపై అలుపెరుగని పోరాటం సాగిస్తున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. తెలంగాణా ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు చేసినా ఎక్కడా స్పందన కనిపించడంలేదని చెప్పుకుంటున్నారు. అసలు ఈ ప్రైవేటు యాజమాన్యం చేస్తున్న ఫిర్యాదుల్లో నిజమెంత. నిజంగానే ఈ "జగజ్జేత" అక్కడి సరుకుని కొనుగోలు చేసి తెలంగాణా యూనిట్లకు దింపుతున్నారా. ఇలా చేయడం వల్ల ఆయనకు వచ్చే ప్రత్యేక లాభమేమీ ఉండదు. ఎందుకంటే ఎవరైతే అమ్ముతున్నారో ఆ రైతులకు ప్రస్తుత ప్రభుత్వ ధర ప్రకారం ప్రతీ పైసా చెల్లించాల్సిందే. ఏదైనా మిగిలితే రవాణాలో చూసుకోవాలి. అది మాత్రం ఎంత మిగులుతుంది కనుక. కాకపోతే ఏదైనా రాజ్యాంగేతర శక్తి "వ్యవసాయ ఆదాయం కింద" ఊరట పొందడానికి ఇలా ప్రోత్సహిస్తున్నారా అనే ఓ ధృవపడని వార్త కూడా దావాలనంలా వ్యాపిస్తున్నది. దీంతోపాటు అత్యధిక "ఓఈఆర్" నేపథ్యంలో ఓ దశాబ్దకాల క్రితంనాటి "డమ్మీ" యవ్వారం పునరావృతమవుతున్నదేమో అంటూ కొందరు రైతు సంఘ నాయకులు వ్యక్తం చేస్తున్న అనుమానాలకు మాత్రం ఎలాంటి ఆధారాలు లేవు. ఫెడరేషన్‌దేమున్నది. వాళ్ళ యూనిట్లు అవిఘ్నంగా నడవడానికి ఎలాగూ ముడిసరుకు కావాలి. వారు అంతవరకే చూసుకుంటారు. తత్తిమా అంశాలతో నిమిత్తం బహుశా ఉండదు. ఐతే దీనిపై వ్యాఖ్యానించడానికి సబంధిత యంత్రాంగం సుముఖంగా లేదు. ఎవరికి వారు తమకేం తెలియదని అంటున్నారు. వ్యవసాయ ఆదాయం కింద ఇలా కోటానుకోట్లు వచ్చిపడుతుంటే., ఆదాయపన్ను రంగంలోకి దిగితే గుట్టురట్టవుతుంది. ఇది కలెక్షన్ సెంటర్ కాదు. కవులుకి తీసుకుని తెచ్చామని తప్పించుకోడానికి ఆ కవులుకిచ్చిన వారెవరో రికార్డుమీదకు రావాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం రకరకాల మలుపులు తిరగబోతున్నట్లు కనిపిస్తున్నది.




# ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

**- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సమావేశం**

**కొత్తగూడెం, ఆగష్టు 29 – ప్రభాతవార్త:** రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల దృశ్య ముసాయిదా ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి కలెక్టర్ ఓటరు జాబితా తయారీ, ప్రచురణ, పోలింగ్ స్టేషన్ల వద్ద జాబితా ప్రచురణ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 471 పంచాయతీలలో మొత్తం 6,69,024 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 3,25,033, మహిళలు 3,43,967 మంది కాగా 24 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. 4168 వార్డులకు గాను 4242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు మండల స్థాయిలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఆగష్టు 30 సాయంత్రం లోపు ఓటర్ల జాబితా పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా మండల కార్యాలయాల్లో తెలియజేయాలని ఆయన తెలిపారు. అభ్యంతరాల సవరణ అనంతరం సెప్టెంబర్ రెండున తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇది ఓటర్ల జాబితా వార్డుల ప్రకారం ప్రదర్శించబడతాయని ఆయన తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రాలలో కల్పించవలసిన మౌలిక వసతులు లేదా సమస్యల పరిష్కారాలను తమ దృష్టికి తేవడం ద్వారా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ లక్ష్మణ్, బాల ప్రసాద్, భారతీయ రాష్ట్ర సమితి రేగా కాంతారావు, సిపిఐ ఎస్ శ్రీనివాస్, సిపిఎం ఏ సత్యనారాయణ, భారతీయ జనతా పార్టీ నరేందర్, నోములబాలు, ఆమ్ ఆద్మీ పార్టీ ఏ రాంబాబు పాల్గొన్నారు.


విలేకరులు కావలెను

ప్రముఖ తెలుగు జాతీయ దిన పత్రిక వార్త లో పనిచేయుటకు ఈ కింది సెంటర్‌లో అనుభవం కలిగిన విలేకరులు కావలెను.

అనుభవం కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత

ఖమ్మం జిల్లా : ఖమ్మం రూరల్, ఖమ్మం కార్పొరేషన్, ఏన్కూర్

భద్రాద్రి కొత్తగూడెం : జూలూరుపాడు, సుజాతనగర్, టేకులపల్లి

వార్త

సంప్రదించ వలసిన చిరునామా

జె. వెంకట రత్నం

రీజినల్ మేనేజర్

సెల్ : 8008003364

# ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**-ఐటిడిఏ పిఓ రాహుల్**

బూర్గంపహాడ్, ఆగస్టు 30, ప్రభాతవార్త:



వాతావరణం మార్పు వలన గ్రామాలలో వైరల్ ఫీవర్ విజృంభిస్తున్నందున హెచ్ఎం, ఉపాధ్యాయులు, వార్డెన్ సమన్వయంతో ఉండి ఆశ్రమ పాఠశాలలో చదివే పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి మెనూ ప్రకారం పౌష్టికారమైన ఆహారాన్ని అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఉప్పుసాక గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను, వద్దుగూడెంలోని జిపిఎస్ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉప్పుసాకా ఆశ్రమ పాఠశాలను సందర్శించి డార్మెటరీ, డైనింగ్ హాల్, వంటగది, సిక్ రూమ్ పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థినీ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పనిచేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది ఎటువంటి విభేదాలు పెట్టుకోకుండా అందరూ కలిసికట్టుగా ఉండి విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వారి విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహార అందించాలని, స్టోర్ రూమ్ లో నాసిరకమైన ఆహార పదార్థాలు డేట్ అయిపోయినవి ఉంటే వెంటనే తీసివేయాలని, జిసిసి నుంచి సరఫరా అయ్యే ప్రతి వస్తువు నాణ్యతగా ఉన్నవి తీసుకోవాలని అన్నారు. అనంతరం సిక్ రూములో వైద్య సేవలు తీసుకుంటున్న విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకొని, పిల్లలు అనారోగ్య బారిన పడినప్పుడు మెడికల్ క్యాంపులు నిర్వహించారా లేదా అని హెచ్ ఎం ని అడిగి తెలుసుకుని, పిల్లలకు రెండు మూడు రోజులు మించి జ్వరంగా ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న పీహెచ్సీకి తీసుకొని పోయి వైద్య పరీక్షలు చేయించి పిల్లల తల్లిదండ్రులకు మరియు డిడి ట్రైబల్ వెల్ఫేర్ ,ఏ టి డి ఓ దృష్టికి విషయం తెలియజేయాలని అన్నారు. అనంతరం సిక్ రూమ్ లోని మందులను పరిశీలించి ఓ ఆర్ ఎస్ పాకెట్లు ఎక్స్పైరీ డేట్ ఈనెలాఖరు వరకే ఉందని కొత్త స్టాకు తీసుకోలేదా అని ఏఎన్ఎంని అడిగి తెలుసుకుని డేట్ అయిపోయిన మందులు ఉంటే వెంటనే తీయించి వేయాలని అన్నారు.



అనంతరం డిఎంహెచ్వో కు ఫోన్ కాల్ ద్వారా ఆదేశాలు జారీ చేస్తూ ఉప్పుసాక పాఠశాలలో నిర్వహించిన మెడికల్ క్యాంపుల వివరాలు, పిల్లల యొక్క ఆరోగ్య స్థితిగతులకు సంబంధించిన డాటా తనకు అందజేయాలని, సరిపడా మందులు ఈ పాఠశాలకు సరఫరా చేసి మెడికల్ క్యాంపులు మరలా నిర్వహించాలని ఆదేశించారు. వంట చేసే సిబ్బంది పరిశుభ్రతను పాటించి వంటగదిని వంట సామాగ్రిని ఎప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని, పాఠశాల ఆరుబయట రాత్రిపూట పిల్లలు ఎవరు? రాకుండా చూడాలని, వర్షాకాలంలో విషపూరితమైన క్రిమి కీటకాలు పాములు తేళ్లు సంచరించే అవకాశం ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్ఎం కు ఆదేశించారు. అనంతరం ప్రైమరీ పాఠశాలలోని ఉద్దీపకం వర్క్ బుక్ 2 నిర్వహణ తీరును పరిశీలించారు. ఉద్దీపకం వర్క్ బుక్ సంబంధించిన ప్రతి అంశం విద్యార్థులకు తెలియజేసే విధంగా బోర్డుపై వ్రాయించాలని అన్నారు. చదువులో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనంతరం ఒక్కొక్క విద్యార్థినీ లేపి ఉద్దీపకం నకు సంబంధించిన పదాలను బోర్డుపై వ్రాయించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల మరమ్మత్తుల కొరకు నిధులు విడుదలయ్యాయనీ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వాష్ రూమ్, టాప్స్, టాయిలెట్స్ ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలని హెచ్ఎంకు సూచించారు. అనంతరం వద్దేగూడెం జిపిఎస్ పాఠశాలను సందర్శించి ఉద్దీపకం వర్క్ బుక్ 2 చిన్నారులకు ఏ విధంగా బోధిస్తున్నది పరిశీలించి చిన్నారులను ఉద్దీపకములోని అంశాలు ఏ విధంగా చదువుతున్నది చూసి పిల్లలు ఉద్దీపకం లోని అంశాలు పదాలు చదవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉద్దీపకంలోని ప్రతి అంశం పదాలు ఉపాధ్యాయులు ముందుగా చదువుకొని ఆ తర్వాత పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉద్దీపకం వర్క్ బుక్ పిల్లలకు బోధన విషయంలో నిర్లక్ష్య వైఖరి కనబరిస్తే సంబంధిత ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని, ఎస్ సి ఆర్ పి ప్రతిరోజు మీ పరిధిలోని పాఠశాలలను తప్పనిసరిగా పర్యవేక్షణ చేసి ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ పిల్లలకు ఏ విధంగా బోధిస్తున్నది పరిశీలించి దానికి సంబంధించిన ఫీడ్బ్యాక్ తనకు పంపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పుసాక పాఠశాల హెచ్ఎం భీమ, వార్డెన్ శశికళ, ఎస్ సి ఆర్ పి మాధవి, వద్దుగూడెం జిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు బాలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీకి శ్రీరామరక్ష

బోనకల్, ప్రభాతవార్త :

అభివృద్ధి సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీకి శ్రీరామరక్ష అని కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శుక్రవారం బిఆర్ఎస్ నుండి భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాయేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. మధిర నియోజకవర్గన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముష్టికుంట్ల గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ



కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బంధం నాగేశ్వరరావు. మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, గ్రామ శాఖ అధ్యక్షులు , సొసైటీ అధ్యక్షులు బోయినపల్లి వెంకటేశ్వర్లు. మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు షేక్ షాజహాన్, ముస్తఫా, అమిరేసి సీతయ్య, బంధం. హుస్సేన్, పండగ లింగరాజు, సీతారాములు, షేక్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

**- సిపిఐ మండల కార్యదర్శి యయగల**

బోనకల్, ప్రభాతవార్త :

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండలంలోని రాపల్లి, బ్రాహ్మణపల్లి, కలకోట గ్రామాలలో దెబ్బతిన్న వరి, పత్తి సాగు రైతులను కలిసి నష్టం అంచనాను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పంట నష్టం వేయాలని కోరారు. పంటనష్టం కారణంగా రైతులు చేసిన అప్పులు ఎలా తీర్చాలో పాలుపోని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలన



చేసి పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి ఏనుగు రామకృష్ణ, ఏనుగు రవికుమార్, ఏలూరి రమేష్, వంగాల హన్మంతరావు, యంగల పెద్ద రమేష్, మాతంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు

పెనుబల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త:



స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ ఆదేశానుసారం గత నాలుగు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు వియం బంజర గ్రామంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకొనుటకు శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని నాయకులు తెలిపారు. అంతేగాని ఎటువంటి ప్రాణ నష్టం గాని, ఆస్తి నష్టం గానీ జరగలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గోగినేని రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మిట్టపల్లి కిరణ్ కుమార్, మేకతొట్టి కాంతయ్య, వంగా నిరంజన్ గౌడ్, భూక్య పుల్లయ్య, తాళ్లూరు రవి, గ్యాస్ చౌదరి, ఆచంటి శ్రీనివాసరావు, భూక్య ప్రసాద్, ముత్తూరు సత్యం, వంగ వెంకటేశ్వరరావు, చదరాశిపల్లి అంకమరావు, గంధం దుర్గయ్య, తురపాటి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ముదిగొండ ప్రభాతవార్త ఆగస్టు 29 :



ప్రపంచ ప్రసిద్ధ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం బాణాపురం ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేశి నివాళులర్పించి ఆయన చేసిన క్రీడా సేవలను స్మరించారు. అనంతరం విద్యార్థులచే క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికైన పూర్వ విద్యార్థిని వై. రచిత (కాకతీయ ఇంటర్ యూనివర్సిటీ ప్లేయర్), అలాగే బి. రేవతి (స్కూల్ గేమ్స్ అండర్17 నేషనల్ ప్లేయర్)లను ఘనంగా సత్కరించారు. తరువాత విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ వెంకటరామిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు పంట నష్టం అంచనా

కల్లూరు, ఆగస్ట్ 29, ప్రభాతవార్త:



కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో భారీ వర్షాలకు పెసర పంట నష్టం పై అంచనా వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారిని రూప తెలిపారు. 126 ఎకరాలలో పెసర పంట 36 మంది రైతులు సాగు చేయగా చేతికందే దశలో భారీ వర్షానికి గాను 75 ఎకరాలలో నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారిని తెలిపారు. 7 క్లస్టర్ భవనాలలో వ్యవసాయ విస్తరణ అధికారులు శుక్రవారం అంచనాలను వేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ కు నివేదిక అందించనున్నట్లు వారి పేర్కొన్నారు. కల్లూరు వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు దీపిక, వెంకట్ లీల, వెంకట్, పవన్ కళ్యాణ్ లతోపాటు తదితరులు అంచనా ను వేసి నట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అధికారి నగేష్ మండలంలో కప్పల బంధం గ్రామంలో ఒకే రైతుకు చెందిన నాలుగు ఎకరాలలో కూరగాయలో పంట నష్టం అయినట్లు వివరించారు.

# సాదాబైనామాపై హైకోర్టు స్టే ఎత్తివేయడంతో రైతు కళ్ళల్లో ఆనందం, హర్షాతిరేకాలు

**- రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల**

**పాల్వంచ టౌన్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:** సాదాబైనామాపై హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేయడంతో రైతుల్లో హర్షాతిరేకాలు, కళ్ళల్లో ఆనందం వ్యక్తం అయిందని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మండల రెవిన్యూ అధికారి కార్యాలయంలో శుక్రవారం కొత్వాల తో పాటు కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ దారా ప్రసాద్ తో సాదా బైనామా విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ... రెవిన్యూ వ్యవస్థలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ధరణి పోర్టల్ తో రాష్ట్ర రైతులందరూ అనేక భూ సమస్యలతో ఎన్నో ఇబ్బందులకు గురి అయ్యారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి



వచ్చిన తర్వాత ధరణి రద్దు చేసి, భూభారతి చట్టం తీసుకువచ్చిందనీ, రైతు సదస్సులు ఏర్పాటు చేసి, వారినుండి దరఖాస్తులు సేకరించిందన్నారు. సాదాబైనామాతో త్వరలో రైతుసమస్యలు తీరనున్నాయనీ, భూసమస్యలకు పరిష్కారం లభించనున్నదన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గార్లకు, కాంగ్రెస్ మంత్రి వర్గానికి తెలంగాణా రాష్ట్ర రైతుల పక్షాన కొత్వాల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఆర్.ఐ నళిన్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాలె జానకి రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, ఎల్. డి. ఎం. కో ఆర్డినేటర్ బద్ది కిషోర్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ నాయకులు కాపర్తి వెంకటాచారి, కందుకూరి రాము, దారా చిరంజీవి కలగట్ల నాగిరెడ్డి, ఉండేటి శాంతివర్ధన్ అలెక్స్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల కోసం ముందుకు వచ్చిన కొల్లి ఫౌండేషన్

**- కోయగట్టు పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, స్టేషనరి పంపిణి చేసిన కొల్లి కల్పనా చౌదరి**



**పాల్వంచ టౌన్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:** గిరిజన ప్రాంతాలలోని పేద విద్యార్థులకు విద్యను అందించాలని పాల్వంచ మండలం కోయగట్టు గ్రామంలో ఒక నెల క్రితం జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ప్రారంభించిన ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించడానికి గుర్తించిన 45 మంది నిరుపేద విద్యార్థులకు అండగ మేమున్నామంటు ముందుకు వచ్చారు కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కల్పనా చౌదరి. కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ సహకారంతో కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోయగట్టు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, డ్రాయింగ్ బుక్స్, బ్యాగులు, నోటు పుస్తకాలతో పాటుగా స్టేషనరి ని అందించారు. ఈ సందర్భంగా కల్పనా చౌదరి మాట్లాడుతూ... కొల్లి ఫౌండేషన్ విద్యాభివృద్ధి



పెంచేందుకు ఎల్లపుడు ముందుంటుందన్నారు. చదువుతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని, చదువుకుంటే ఏ రంగంలోనైనా రాణించగలరని ప్రతి ఒక్కరు విద్యను ప్రోత్సహించాలన్నారు. తల్లి తండ్రుల ఆశలు, ఆశయాలకు తగ్గట్లుగా పిల్లలు చదువుకోవాలని సూచించిన ఆమె పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరితేనే చదువుకు సార్ధకత లభిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో కూడ ప్రభుత్వంతో కలిసి విద్యార్థుల ప్రయోజనం కోసం పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, భవిష్యత్ లో కోయగట్టు పాఠశాల పక్కా భవన నిర్మాణం కోసం సహాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కోయగట్టు ప్రధానోపాధ్యయులు బిక్షం మాట్లాడుతూ... పాఠశాలలో పిల్లల పరిస్థితి గురించి తెలిపిన వెంటనే స్పందించి మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన కోయగట్టు గ్రామానికి సరైన రహదారి లేకపోయిన వచ్చి విద్యార్థులకు అండగా నిలిచిన కొల్లి ఫౌండేషన్ ఫౌండర్ కల్పనా చౌదరి, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ గూడూరు సత్యనారాయణ, కో ఆర్డినేటర్ రూప్లా నాయక్ లకు విద్యార్థులు, వారి తల్లితండ్రుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు కొల్లి కల్పనా చౌదరి ని శాలువాతో సత్కరించి సన్మానించారు.

## గణేష్ మంటపంలో కొత్వాల పూజలు

**పాల్వంచ టౌన్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:**



గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాత పాల్వంచ గడియ కట్టలోని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా సామూహిక లలితా సహస్ర కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పూజారి కందాళ సింహాద్రి ఆనంద కుమారాచార్యులు మహిళలచే కుంకుమ పూజ చేయించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్ మాజీ డైరెక్టర్, దీదిలీళీ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, ఉత్సవ కమిటీ సభ్యులు బర్ల అన్వేష్, కొండపల్లి నాగరాజు, రొండ్ల శంకర్ రెడ్డి, బట్ట సాగర్, మాడి శెట్టి జయంత్, బట్ట మణికంత, బూతం జగన్, గూడపాటి ప్రవీణ్, కట్టా శ్రీను, పిల్లల బాలాజీ, కమిటీ సభ్యులు, ఏరియా పెద్దలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

## గోల్డెన్ జూబ్లీ జరుపుకుంటున్న వర్తక సంఘం విఘ్నేశ్వర నవరాత్రులు

**పాల్వంచ టౌన్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:**



దివంగత రావూరి గంగయ్య కాంప్లెక్స్ వద్ద వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన్ టువంటి పందిరిలో మూడవరోజు శుక్రవారం నాడు అత్యధికముగా 150, 200 మంది మహిళలచే లక్ష్మీ అమ్మవారికి విఘ్నేశ్వర స్వామి వారి సమక్షంలో కుంకుమ పూజలు, అష్టోత్తరం, లలిత సహస్రనామాలు నిర్వహించారు. పాల్వంచ అంతా బాగుండాలి అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని వేద పండితులు నాని శర్మ గారిచే జరిపించారు. అలాగే స్వామివారికి ఈరోజు నిత్య నైవేద్యం ప్రసాదం అపోలో ప్రకాష్ వాసవి దంపతులు, గుబ్బ దుర్గ, గూడెపు శ్రీనివాస్ స్వాతి దంపతులు సమర్పించారు, ఈ కార్యక్రమంలో వర్తక సంఘం కన్వీనర్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు చలవాది ప్రకాష్, ఉత్సవ కమిటీ మహిళ అధ్యక్షులు పెండ్యాల రోజాలక్ష్మీ, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి గూడెపు శ్రీనివాస్, వర్తక సంఘం అధ్యక్షులు పెండ్యాల కృష్ణ, గడ్డల కళ్యాణి, మోనిక, దీప్తి, సౌజన్య, అశ్విని భారతి, సుష్మ, రాధిక ధనలక్ష్మీ, ఇంకా అనేకమంది పాల్గొన్నారు.

# గాంధీపథం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన సన్మానం

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:** గాంధీపథం, పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఘనంగా సన్మానించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ముచ్చటగా మూడోసారి కూడా ఎంపికైన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి పుష్పగుచ్చాలు అందించారు. స్వీట్లు తినిపించారు. ఈ కారర్యక్రమంలో చింతలచెర్వు గెర్షోమ్, నర్సయ్య, కళావతి, రఘుపతి, సుమన, శ్రీకాంత్, శ్రీరాములు, జ్ఞాన వినోదిని, రామ తులసి, ఎర్నెస్ట్ లీనా, ఎలిజబెత్, ఎఫ్రాయిల్ పాల్గొన్నారు.



# వైద్యరంగంలో కొత్తగూడెం జిల్లా కేంద్రం మరింత బలపడాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**
**- శ్రీ ఉషా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించిన నేత**

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:**



ఏజెన్సీ గ్రామాలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణం వైద్యరంగంలో మరింత బలోపేతం కావాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని ఓల్డ్ డిపో ఏరియాలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ ఉషా మల్టీ స్పెసిలిటీ అండ్ డయాలసిస్ ఆస్పత్రిని శుక్రవారం అయన ప్రారంభించి ఆస్పత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైద్యశాల వివిధ జబ్బులు, ప్రాణాంతక వ్యాధులు, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పేదవర్గాల ఆధునిక వైద్య సౌకర్యంలో అందుబాటులోకి వస్తుండటం శుభపరిణామమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు కేవలం లాభాల కోసం కాకుండా ప్రజాసేవా భావంతో ముందుకు రావాలని, బలహీన వర్గాల ప్రజలకు తక్కువ ధరల్లో అవసరమైతే ఉచిత సేవలు అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. వైద్యసేవలు అందరికీ హక్కుగా మారేలా ప్రభుత్వము కూడా ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించి, పేదలకు సహాయం అందించాలి అని డిమాండ్ చేశారు. ప్రారంభ కార్యక్రమంలో వైద్యులు నాగరాజు, విజయకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, మైనార్టీ సంఘాల రాష్ట్ర నాయకులు నయీమ్ ఖురేషి, మాజీ కౌన్సిలర్లు యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడా పోటీల కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**-మేజర్ ధ్యాన్ చందన్ చిత్రంతో ఆకట్టుకున్న భాను శ్రీ**

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 29 – ప్రభాతవార్త:**



రాష్ట్ర క్రీడా శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఈనెల 23 నుంచి 31 వరకు జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు అందించడంతో కొత్తగూడెం పట్టణంలో గల ప్రకాశం స్టేడియంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రభుత్వ రికగ్నైజ్డ్ ఆర్గనైజేషన్స్ ఇందులో పాల్గొని పిల్లలకి క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని పెంపొందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది పైచిలుకు విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటారు. శుక్రవారం జరిగిన పోటీల్లో పాల్వంచ పట్నానికి చెందిన భాను శ్రీ భారతదేశం గర్వించదగ్గ హాకీ ప్లేయర్ మేజర్ ధ్యాన్ చంద్ గీసినచ చిత్రం చిత్రం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వివిధ క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడా పోటీలను నిర్వహించుకుంటామని, ధ్యాన్ చంద్ ఆశయాల్లో భాగంగా కొత్తతరం క్రీడాకారులను తీర్చిదిద్దే విధంగా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. చిన్నారులు క్రీడలు వాడటం వలన శారీరక శక్తే కాక ఆత్మస్థైర్యం పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడా అధికారి పరంధామ రెడ్డి ,ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ యుగంధర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ సెక్రెటరీ నరేష్, జిల్లా బాక్సింగ్ ప్రెసిడెంట్ ఎర్ర కామేష్, టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు వై వెంకటేశ్వర్లు, బ్యాట్మెంటన్ సెక్రెటరీ సావిత్రి మరియు వివిధ క్రీడాల కోచ్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితాపై అభ్యర్థనలు తెలపండి

**- ఎంపీడీవో శ్రీనివాసరావు**

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు29 :** తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల మేరకు రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని తయారుచేసిన ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలను పరిశీలించడానికి వాటిపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించడానికి నేడు అఖిలపక్ష సమావేశం నిర్వహించబడుతుందని మణుగూరు ఎంపీడీవో టి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ఈ ప్రకటనలో ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ఒకముఖ్యమైన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున అఖిలపక్ష సమావేశానికి హాజరై అన్ని రాజకీయ పక్షాలు అభ్యంతరాలు, సూచనలు అందజేయాలని కోరారు.



## ఎక్స్‌లెంట్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు29 :** మణుగూరు ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవంతో పాటు తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎక్స్‌లెంట్ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన క్రీడా, సాంస్కృతిక ప్రదర్శనలు, తెలుగుభాష ప్రాముఖ్యతలను ప్రతిబింబించే ప్రసంగాలు, కవితలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాఠశాల




కరస్పాండెంట్ ఖాదర్, ప్రిన్సిపాల్ యూసఫ్, డైరెక్టర్ షరీఫ్, సమీనాలు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

## అంకితభావంతో విధులు నిర్వహించాలి

**- యంత్ర సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి**

**- మణుగూరు ఏరియా మల్టీడిపార్ట్‌మెంట్ టీమ్స్ కన్వీనర్, ఏరియా జీఎం దుర్గం రామచందర్**



**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 29 :**



ప్రతిఒక్కరు అంకితభావంతో విధులు నిర్వహించాలని మణుగూరు ఏరియా మల్టీడిపార్ట్‌మెంట్ టీమ్స్ కన్వీనర్, ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. ఆయన శుక్రవారం మణుగూరు ఏరియా పీకేఓసీలో మల్టీడిపార్ట్‌మెంట్ టీమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. సమిష్టికృషితో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి కృషిచేయాలని, నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తికి పాటుపడాలని, పనిప్రదేశాల్లో రక్షణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఆదర్శంగా నిలబడాలని అందుకు సింగరేణి సంస్థ ఉద్యోగులందరూ అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. 2025-26 సంవత్సరంలో వార్షిక ఉత్పత్తి లక్ష్యమైన 72మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషిచేయాలన్నారు. యంత్ర సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని పనిగంటలను సద్వినియోగం చేసుకొని, తక్కువ ఖర్చుతో ఎక్కువ బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు కృషిచేయాలన్నారు. తొలుత మన సంస్థ, మన గని, మన బాధ్యత అనే అంశాలపై సింగరేణి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీకేఓసీ పీవో లక్ష్మీపతిగౌడ్, ఏజీఎం(ఐఈడీ) సీహెచ్.రాంబాబు, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, డీజీఎం(ఫైనాన్స్) అనురాధ, డీజీఎం(సివిల్) శివప్రసాద్, ప్రాజెక్టు ఇంజనీరు వీరభద్రుడు, మేనేజర్ సురేష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ డి.నరేష్, వంశీకృష్ణ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నేతలు వై.రాంగోపాల్, వి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాకు విశేషస్పందన

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 29 :** మణుగూరు ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేషస్పందన లభించింది. జాబ్‌మేళా ప్రారంభం సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపాల్ జి.రవి మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ అనుబంధంగా వ్యవహరిస్తున్న ఎస్ఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించ తలపెట్టిన జాబ్‌మేళాకు ఆసక్తి కనబరిచి యువత పెద్దఎత్తున హాజరుకావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ



జాబ్‌మేళాలో సుమారు 500మంది యువకులు హాజరుకాగా.. కంపెనీ నియమనిబంధనల ప్రకారం 200మంది అర్హత సాధించారు. వీరిలో 75మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఇంటర్వ్యూ జరిగిన విధానంలో ప్రతిభావంతులను గుర్తించడం జరుగుతుందన్నారు. ఎంపికైనవారికి వారంరోజుల్లో నియామక పత్రాలు అందజేయనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ రవి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎంఎస్ కంపెనీ జీఎం(కోఆర్డినేటర్) సీవీరెడ్డి, సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ సౌరభ్, డ్యూటీ హెచ్ఆర్ శ్రీహరి, కళాశాల సిబ్బంది మయ్యా శ్రీనివాసరావు, జీవీ కృష్ణారావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాస్తవ లాభాలు ప్రకటించాలి

**- టీబీజీకేఎస్ ఏరియా వైస్‌ప్రెసిడెంట్ నాగెల్లి**

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 29 :** 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను సింగరేణి సంస్థలో ఉత్పత్తి ఆధారంగా సాధించిన వాస్తవలాభాలను వెల్లడించి కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏరియా టీబీజీకేఎస్ వైస్‌ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు శుక్రవారం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగెల్లి మాట్లాడుతూ.. సంఘ గౌరవాధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణల ఆదేశానుసారం తమ డిమాండ్లతో మణుగూరు ఏరియాలో ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు.



వాస్తవ లాభాలపై 35శాతం వాటాను ప్రకటించాలని, కార్మికుల ఆదాయపన్ను రద్దుచేయాలని, అలవెన్సులపై ఆదాయపుపన్ను యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, మస్తాన్, ముఖేష్, నరేష్, వినయ్‌కుమార్, దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ట్రైనీ కలెక్టర్

**చుంచుపల్లి, ఆగస్టు 29 - ప్రభాతవార్త:**



మండల పరిధిలోని విద్యా నగర్ కాలనీ నందు గల అంగన్వాడి సెంటర్‌ను , ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా అంగన్వాడి సెంటర్‌ను సందర్శించి పిల్లల ఎత్తు ,బరువును వారికిచ్చే ఆహారమును, అక్కడ ఉన్నటువంటి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంగన్వాడి సెంటర్ పరిశుభ్రత తో పాటు పిల్లలకు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని ఆయన సూచించారు. వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు . ఈ కార్యక్రమంలో సిడిపిఓ పద్మశ్రీ , సూపర్వైజర్ సీతా మంగమ్మ, అంగన్వాడి టీచర్ వాణి, ప్రాథమిక ఉపకేంద్ర సిహెచ్ఓ సుష్మ, ఏఎన్ఎంలు భాగ్యలక్ష్మి, రాంబాయి, ఆశా వర్కర్ వాణి, గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాస్ రెడ్డి, పంచాయితీ గుమస్తా రామకృష్ణ పాల్గొన్నారు .

## పతకాలు సాధించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త:**



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం 2024 మరియు నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు సేవా పతకాలలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను ఉత్తమ సేవ పతకం పొందిన వారిలో ఎం. అబ్దుల్ రహీమాన్ ( ఏసిపి వైరా ) పి.సత్యనారాయణ (ఎస్సై ఐటి కోర్) వున్నారు.అదేవిధంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మరో నలుగురు పోలీసు అధికారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకాలు దక్కాయి..సేవాపతకం పొందిన వారిలో బి.వెంకటరమణారావు (ఏఎస్సై), జె.వెంకటేశ్వర్లు (ఏఎస్సై), ఎన్.వెంకట రెడ్డి (ఏఎస్సై), మహోన్నత సేవ పతకం సాధించిన శ్రీ.సయ్యద్ హుస్సేన్ (హెడ్ కానిస్టేబుల్)వున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా అందజేసి అభినందించారు.

## 49వ డివిజన్లో మొక్కలు పంపిణీ చేసిన కార్పొరేటర్ దుద్దుకూరి

**ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 29 ప్రభాతవార్త:**



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ 49వ డివిజన్ పరిధిలో పొడి-తడి చెత్త వేరు చేసే విధ్యానంపై అవగాహన కార్యక్రమంతో పాటు మొక్కలను 49 డివిజన్ కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది.కార్యక్రమానికి గౌరవ మేయర్ గారు హాజరై ప్రజలకు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు. ప్రతి ఇంటిలోనే చెత్తను వేరు చేయడం ద్వారా నగరం శుభ్రంగా, ఆరోగ్యవంతంగా మారుతుందని తెలియజేశారు. అదే విధంగా ఇంటింటికి మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు మొక్కల పంపిణీ కూడా చేపట్టారు. ఇచ్చిన ప్రతి మొక్కను పెంచాలని ప్రజలకు సూచించారు.